# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 6 | గురువారం | 20.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 6 | Thursday | 20.08.2026 | Pages: 8 | Rate: 2


## మౌలిక రంగానికి రూ.13 వేల కోట్లు



- ఐదు భారీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా
- 4 రైల్వే ప్రాజెక్టులకు రూ.9,450 కోట్లు
- గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు రూ.2,229 కోట్లు
- బిహార్‌లో నాలుగు వరుసల రహదారికి రూ.3,591 కోట్లు
- రైల్వే రద్దీ తగ్గింపు.. సరుకు రవాణా సామర్థ్యం పెంపే లక్ష్యం

4

## నీట్ లీక్‌పై సుప్రీం సీరియస్

- ఎన్‌టీఏలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిందే
- తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత వ్యవస్థ ఉండాలని స్పష్టీకరణ
- ప్రశ్నపత్రాల భద్రత, సైబర్ సెక్యూరిటీపై పూర్తి వివరాలు కోరిన ధర్మాసనం
- సంస్థాగత మార్పులపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
- ఎన్‌టీఏ సంస్కరణలను పర్యవేక్షిస్తామన్న సుప్రీంకోర్టు

4





## గురువునే కడతేర్చిన విద్యార్థులు!

- ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు
- పదో తరగతి చదివిన ఇద్దరు మైనర్లే నిందితులని పోలీసుల నిర్ధారణ
- ముందుగానే ఇంట్లోకి చొరబడి వంటగదిలో మాటు
- రూ.2 లక్షల కోసం దారుణ హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడి
- గంజాయి, జల్సాలకు అలవాటుపడి ఘాతుకానికి తెగబడినట్లు గుర్తింపు

చదువు చెప్పిన గురువుపైనే కత్తి దూశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 27 సార్లు పొడిచి ప్రాణాలు తీశారు. అనంతరం ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని సుమారు రూ.2 లక్షల నగదుతో పరారయ్యారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన విషయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘాతుకానికి పాల్పడింది ఆమె వద్ద చదువుకున్న పదో తరగతి విద్యార్థులేనని పోలీసులు గుర్తించారు. 2

# 22/ఏ సమస్యకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

- ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి
- పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
- అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 19:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా భూ యజమానుల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని చేపట్టింది. 22ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతో రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22ఏ సమస్యపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించారు.

మిగతా 2 లో



2

## ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



## కాంగ్రెస్‌లో 'కొండా' కలకలం!

- టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి స్వతంత్ర పోటీకి సిద్ధం
- 'సీఎం రేవంతా.. పొంగులేటా?' అంటూ సుష్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు
- కొండా మురళికి ఇచ్చిన ఎమ్మెల్సీ హామీ ఏమైందని ప్రశ్న
- సీఎం కుటుంబంపై అవినీతి ఆరోపణలు.. మరిన్ని బయటపెడతానని హెచ్చరిక
- వ్యాఖ్యలను ఖండించిన మల్లు రవి.. చర్యలు తప్పవని స్పష్టీకరణ

2

## ఓట్ల తొలగింపునకు ఎస్ఐఆర్ అస్త్రం

కేంద్రానివి కుట్రపూరిత రాజకీయాలు

బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్‌ను దెబ్బతీసే ప్రయత్నం

- దళిత, గిరిజన, మైనారిటీ ఓట్లే లక్ష్యమని ఆరోపణ
- బూత్‌స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం

2



## కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

- నసీర్ మాట్నీ సంచలన వ్యాఖ్యలు



4



## బాలికల జీవితాలతో చెలగాటం.. 33 మందికి శిక్ష

- వ్యభిచార రొంపిలోకి మైనర్లను దింపిన ముఠాపై నాంపల్లి పోక్సో కోర్టు కొరడా
- ఐదుగురికి జీవిత ఖైదు.. మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు
- 14 మందికి పదేళ్ల కఠిన కారాగారం.. మిగిలిన వారికీ పాత్రను బట్టి శిక్షలు
- తొమ్మిది మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం

2

## టిమ్స్‌కు వెళ్లకుండా 'లాక్'!



4

- సనత్‌నగర్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపు
- హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ గృహ నిర్బంధం
- కోకాపేట్‌లో హరీశ్ నివాసం వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- ప్రారంభోత్సవంలో సీఎం వ్యాఖ్యలు అవాస్తవమన్న బీఆర్ఎస్ నేతలు
- వాస్తవాలు చెబుతామంటే అడ్డుకుంటున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం

## బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి



3

- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు

2

## కోల్‌కతా హోటల్‌లో అగ్నిప్రమాదం

- అర్ధరాత్రి అగ్నికీలలు.. 9 మంది దుర్మరణం
- మృతుల్లో చిన్నారి.. అందరూ బంగ్లాదేశీయులే
- వైద్య చికిత్స కోసం వచ్చి మృత్యువాత

4



# 22/ఏ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

- ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి
- పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి
- అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 19:** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఏ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఏ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 22/ఏ భూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 22/ఏ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ది పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.



## బాలికల జీవితాలతో చెలగాటం..
# 33 మందికి శిక్ష

### వ్యభిచార రొంపిలోకి మైనర్లను దింపిన ముఠాపై నాంపల్లి పోక్సో కోర్టు కొరడా

**ఐదుగురికి జీవిత ఖైదు.. మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు**

**14 మందికి పదేళ్ల కఠిన కారాగారం..**

**మిగిలిన వారికీ పాత్రను బట్టి శిక్షలు**

**9 మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం**

**హైదరాబాద్, ఆగస్టు 19:** మైనర్ బాలికలను ప్రలోభాలకు గురిచేసి వ్యభిచార రొంపిలోకి దింపిన ముఠాపై నాంపల్లి పోక్సో కోర్టు కొరడా ఝుళిపించింది. పదకొండేళ్ల క్రితం నమోదైన కేసులో 33 మందిని దోషులుగా నిర్ధారిస్తూ కీలక తీర్పు వెలువరించింది. నేర తీవ్రత, కేసులో దోషుల పాత్ర ఆధారంగా ఐదుగురికి జీవిత ఖైదు విధించగా, మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన దోషులకు సైతం వారి పాత్రను బట్టి శిక్షలు ఖరారు చేసినట్లు సమాచారం. 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం నాంపల్లి పోక్సో కోర్టు ఈ తీర్పును వెలువరించింది. తొమ్మిది మంది మైనర్ బాలికలను ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేసి వారిని వ్యభిచారంలోకి దింపినట్లు అభియోగాలు నమోదయ్యాయి. కేసు విచారణలో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు, ఆధారాలను న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించింది. సుదీర్ఘంగా సాగిన విచారణ అనంతరం నిందితుల్లో 33 మందిని దోషులుగా నిర్ధారించి శిక్షలను ఖరారు చేసింది.

**బాధిత బాలికలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం**

దోషులకు కఠిన శిక్షలు విధించడంతో పాటు బాధిత బాలికలకు పరిహారం అందించాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో బాధితులైన తొమ్మిది మంది బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని స్పష్టం చేసింది. మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను ఛిద్రం చేసిన ముఠా సభ్యులకు భారీ శిక్షలు విధిస్తూ నాంపల్లి పోక్సో కోర్టు వెలువరించిన తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.



## ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

**ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలి**

**ఖమ్మం, ఆగస్టు 19:** గ్రామీణ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తూ పల్లెల ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 12 మంది దివ్యాంగులకు వందశాతం సబ్సిడీపై మూడు చక్రాల మోటార్ వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నాను. రూ. 61.76 కోట్లతో ప్లలెగూడెంలో సీసీ, బీటీ రోడ్ల తో పాటు వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెగూడెంలో ప్రభుత్వ మరియు అసైన్డ్ భూములను ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షల నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సభలో పింఛన్లు కావాలని అడిగిన మహిళలకు నెల 31వ తేదీలోగా అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## కేంద్ర ప్రభుత్వానివి కుట్రపూరిత రాజకీయాలు

**ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓట్ల తొలగింపు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణ**

**ఖమ్మం, ఆగస్టు 19:** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ అనే పక్రియను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీతో కలిసి భాజపా కుట్రలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు ఎస్ఐఆర్ అనే భూతాన్ని చూపి భారీగా ఓట్ల తొలగింపుకు తెరలేపిందన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పీఏసీ సమావేశంలో ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కో ఇన్చార్జి సచిన్ సావంత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ,పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివసా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల ఓట్లే లక్ష్యంగా సుమారు 67 నుంచి 68 లక్షల ఓట్లను తొలగించేందుకు శ్రీకారం చుట్టడమే కాకుండా, మరో 70 లక్షల ఓట్లను గాలిలో పెట్టి ఓటర్లను గందరగోళానికి గురిచేస్తున్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు రాబోయే 4-5 రోజుల్లో బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## సవాళ్లకు అనుగుణంగా పోలీస్ శాఖలో మార్పులు

**513 మంది సిబ్బంది వివిధ విభాగాలకు బదిలీ**



**హైదరాబాద్, ఆగస్టు 19:** మారుతున్న సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ విభాగాలకు చెందిన 513 మంది సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. బదిలీ అయిన 513 మందిలో 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు ఉన్నారు. వీరితో పాటు 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు డీజీపీ తెలిపారు. ఈ బదిలీల్లో భాగంగా అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. కొత్త బాధ్యతలు చేపట్టే ముందు సిబ్బందిని రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటాచ్‌మెంట్ ద్వారా పనిచేయించనున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, సామర్థ్యం ఆధారంగా తుది బాధ్యతలను నిర్ణయించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లో 'కొండా' కలకలం!

**టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి స్వతంత్ర పోటీకి సిద్ధం**

**'సీఎం రేవంతా.. పొంగులేటా?' అంటూ సుష్మితా పటేల్ సంచలన వ్యాఖ్యలు**

**కొండా మురళీకి ఇచ్చిన ఎమ్మెల్సీ హామీ ఏమైందని ప్రశ్న**

**రేవూరి ప్రకాశ్‌రెడ్డి టికెట్‌పై తీవ్ర అభ్యంతరం**

**సీఎం కుటుంబంపై అవినీతి ఆరోపణలు.. మరిన్ని బయటపెడతానని హెచ్చరిక**

### వ్యాఖ్యలను ఖండించిన మల్లు రవి.. చర్యలు తప్పవని స్పష్టీకరణ



**వరంగల్, ఆగస్టు 19:** మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆమె ప్రకటించారు. అంతటితో ఆగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుబడుతూ.. "అసలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డా.. పొంగులేటి శ్రీనివాసరెడ్డా? ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు" అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం సృష్టించాయి. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన వైఖరిలో మార్పు వచ్చిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో తన తండ్రి కొండా మురళీ కీలకంగా సహకరించారని అన్నారు. ఆ సమయంలో కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు.

**'మైసమ్మపై ప్రమాణం చేస్తారా?'**

కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి చెప్పగలరా? అంటూ సుష్మితా పటేల్ సవాల్ విసిరారు. "హామీ ఇవ్వలేదని ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం "అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్" మధ్య పోటీ నడుస్తోందని వ్యాఖ్యానించారు. పరకాల నియోజకవర్గంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా ప్రశ్నించారు. దమ్ముంటే ఆయనతో రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. "మా ఇలాఖాకు వచ్చి మాతో ఎందుకు పెట్టుకుంటున్నారు?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ తనకు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. దీంతో పరకాల కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమైనట్టయ్యాయి. రేవంత్‌రెడ్డి సోదరుడికి సంబంధించిన రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే ఇప్పటివరకు బయటపెట్టానని సుష్మితా ఆరోపించారు. తనపై కౌంటర్‌కు దిగితే మరిన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కూడా తీవ్ర ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో లేదో కూడా చెప్పలేమంటూ వ్యాఖ్యానించారు.

**సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం**

సుష్మితా పటేల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని ఖండించారు. పూర్తి వివరాలు తెప్పించుకుని పరిశీలించిన తర్వాత పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి కుమార్తెనే ముఖ్యమంత్రి, పార్టీ నాయకత్వంపై బహిరంగంగా తీవ్ర వ్యాఖ్యలు చేయడం, టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర పోటీకి దిగుతానని ప్రకటించడం కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ ప్రకంపనలకు దారితీసింది.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

**నటి నిధి అగర్వాల్‌కు ఈడీ ప్రశ్నలు**



**హైదరాబాద్, ఆగస్టు 19:** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

# గురువునే కడతేర్చిన టెన్త్ విద్యార్థులు!

- నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు
- పదో తరగతి చదివిన ఇద్దరు మైనర్లే నిందితులని పోలీసుల నిర్ధారణ
- ముందుగానే ఇంట్లోకి చొరబడి వంటగదిలో మాటు
- రూ.2 లక్షల నగదు కోసం దారుణ హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడి

గంజాయి, జల్సాలకు అలవాటుపడి ఘాతుకానికి తెగబడినట్లు పోలీసుల గుర్తింపు



**నల్లగొండ, ఆగస్టు 19:** చదువు చెప్పిన గురువుపైనే కత్తి దూశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 27 సార్లు పొడిచి ప్రాణాలు తీశారు. అనంతరం ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని సుమారు రూ.2 లక్షల నగదుతో పరారయ్యారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన విషయాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘాతుకానికి పాల్పడింది ఆమె వద్ద చదువుకున్న పదో తరగతి విద్యార్థులేనని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 11న సాయంత్రం 6 గంటల సమయంలో రూపారెడ్డి హత్యకు గురయ్యారు. ఆమె పాఠశాల నుంచి ఇంటికి వచ్చే సమయాన్ని ముందుగానే గమనించిన నిందితులు పక్కా పథకం ప్రకారం ఇంట్లోకి చొరబడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రూపారెడ్డి ఇంటికి చేరుకునే ముందే గోడ దూకి లోపలికి ప్రవేశించిన ఇద్దరు మైనర్లు.. ఇంటి తాళం తీసి వంటగదిలో దాక్కున్నట్లు గుర్తించారు.

**ఇంట్లో మాటు.. వచ్చాక దాడి**

పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన రూపారెడ్డి కొద్దిసేపటి తర్వాత పడకగదిలోకి వెళ్లారు. అప్పటికే వంటగదిలో మాటువేసిన నిందితులు వెనుక నుంచి వచ్చి ఆమెపై కత్తితో దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. తప్పించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఏకంగా 27 సార్లు పొడవడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హత్య అనంతరం రూపారెడ్డి హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేసిన నిందితులు అందులో ఉన్న సుమారు రూ.2 లక్షల నగదును తీసుకుని పరారైనట్లు పోలీసులు తెలిపారు.

**గంజాయి.. జల్సాల కోసమేనా?**

నిందితులైన మైనర్లు గంజాయికి, జల్సాలకు అలవాటుపడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. తమ అవసరాలకు డబ్బు కావడంతో రూపారెడ్డి వద్ద నగదు ఉంటుందని భావించి హత్యకు పథకం వేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్య తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి దోచుకున్న డబ్బుతో జల్సాలు చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు సమాచారం.

**కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్తలు**

హత్యకు ముందు నుంచే నిందితులు జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సీసీ కెమెరాలకు చిక్కకుండా కదలికలు సాగించడంతో తొలుత నిందితులను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వివిధ కోణాల్లో ఆధారాలను విశ్లేషించిన పోలీసులు చివరకు ఇద్దరు మైనర్లపై అనుమానం వ్యక్తం చేసి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్యకు సంబంధించిన కీలక విషయాలు బయటపడినట్లు తెలిపారు. చదువు చెప్పి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ప్రిన్సిపల్‌నే డబ్బు కోసం ఆమె వద్ద చదువుకున్న విద్యార్థులు హత్య చేశారన్న విషయం కొండమల్లేపల్లిలో తీవ్ర దిగ్భ్రాంతి రేపుతోంది. మైనర్లు మత్తుకు, జల్సాలకు బానిసై ఇంతటి ఘాతుకానికి పాల్పడ్డారన్న పోలీసుల దర్యాప్తు అంశాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

# టిమ్స్‌కు వెళ్లకుండా నేతల 'లాక్'!

- సనత్‌నగర్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపు
- హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ గృహ నిర్బంధం
- కోకాపేట్‌లో హరీశ్ నివాసం వద్ద భారీగా పోలీసుల మోహరింపు
- ప్రారంభోత్సవంలో సీఎం వ్యాఖ్యలు అవాస్తవమన్న బీఆర్ఎస్ నేతలు
- వాస్తవాలు చెబుతామంటే అడ్డుకుంటున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం



**హైదరాబాద్, ఆగస్టు 19:** సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు చర్యలకు దిగారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లను గృహ నిర్బంధం చేశారు. కోకాపేట్‌లోని హరీశ్‌రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతల కదలికలపైనా పోలీసులు ఆంక్షలు విధించినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. సనత్‌నగర్‌లో ఇటీవల ప్రారంభించిన టిమ్స్ ఆస్పత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పడంతో పాటు టిమ్స్ నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వివరించాలన్న ఉద్దేశంతో సందర్శనకు పిలుపునిచ్చినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు ఆస్పత్రికి బయలుదేరకుండా పోలీసులు ఆయన నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి గృహ నిర్బంధం చేశారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కూడా ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు.

### 'మౌలిక వసతులు లేకుండానే ప్రారంభించారు'

సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో సమకూర్చకుండానే ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఆస్పత్రిని ప్రత్యక్షంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను ప్రజల ముందు ఉంచేందుకే తాము వెళ్లాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

### 'వాస్తవాలు చెబుతామంటే నిర్బంధమా?'

తమను గృహ నిర్బంధం చేయడంపై తలసాని శ్రీనివాస్‌యాదవ్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నేతలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల్లోని అవాస్తవాలను ప్రజలకు వివరించేందుకు ఆస్పత్రిని సందర్శించాలనుకుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులను సైతం ఎందుకు గృహ నిర్బంధం చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ హయాంలోనే టిమ్స్‌కు శ్రీకారం

రాష్ట్రంలోని ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరం నలువైపులా టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2022 ఏప్రిల్ 26న సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల నాటికే ఆయా ఆస్పత్రుల నిర్మాణ పనులు గణనీయంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు.




# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృథా

## భూసేకరణలో బాధితులను పట్టించుకోరా

## కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఆగస్ట్ 19 :** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# ఇంటర్ బోర్డులో విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్, ఆగస్ట్ 19:** నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో విజిలెన్స్ సోదాలు జరిగాయి. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు కొనసాగిస్తోంది. 2019 ఇంటర్ ఫలితాల వ్యవహారంలో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్కుల్లో తప్పులు దొర్లడంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నారు.

# సినిమా టికెట్లపై ప్రభుత్వం కీలక ఆదేశాలు

## థియేటర్ స్క్రీన్స్ ఆధారంగా రేట్లు

## ఐదు షోలకు అనుమతి..ఆదాయంలో కార్మికులకు వాటా




**హైదరాబాద్, ఆగస్ట్ 19:** తెలంగాణలో సినిమా టికెట్ రేట్లపై ప్రభుత్వం కీలక జీవో జారీ చేసింది. కొత్తగా స్పెషల్ థియేటర్స్ కేటగిరీని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 7.1 సౌండ్, 2కె/4కె స్క్రీన్లకు స్పెషల్ కేటగిరీ వర్తించనుంది. ప్రతి థియేటర్‌లో 25 శాతం నాన్-ప్రీమియం సీట్లు ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు 5 షోలకు అనుమతి ఇచ్చింది. చిన్న సినిమాలకు ప్రతి రోజు ఒక షో తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. రూ.100 కోట్లు పైబడిన సినిమాలకు ప్రభుత్వం సూపర్ హై బడ్జెట్ హోదా కల్పించింది. తొలి 10 రోజులు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం కల్పించింది. టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత శాతాన్ని కార్మికుల సంక్షేమ నిధికి విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టింది. కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి వరకు విరాళం తప్పనిసరి చేసింది.




# బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

## ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 19:** తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో బుధవారం నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం ప్రభుత్వ వ్యయంతోనే ఈ భారీ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, విస్తృత స్థాయి ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన మార్కెట్లు మరియు వినూత్న నిధుల విధానాలు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ మరియు వ్యవసాయ రంగాలే ప్రధాన పునాది అని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి, రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలని, బ్యాంకింగ్ వ్యవస్థే నేరుగా రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందజేయాలని, దాంతో పాటు డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాలను కూడా అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని కోరారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా రుణ వ్యూహాలు ఉండాలని, ఒకవేళ రైతు రుణం చెల్లించలేకపోతే రికవరీ చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా, అతని ఆదాయం ఎందుకు తగ్గిందో లోతుగా విశ్లేషించాలని బ్యాంకు ప్రతినిధులకు మార్గదర్శకత్వం చేశారు. జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి రూ. 52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగం పాత్రను పునరుద్ఘాటిస్తూ, రుణాల మంజూరుకు స్పష్టమైన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు. 'తెలంగాణ రైజింగ్-2047' రోడ్‌మ్యాప్‌లోని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతీయ నమూనాలకు అనుగుణంగా బ్యాంకులు ప్రత్యేక రుణ వ్యూహాలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 19.13 లక్షల జనధన్ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ, బిజినెస్ కరస్పాండెంట్లను క్రియాశీలం చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేందుకు 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సమయానికి అందేలా చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈవో దివ్య, నబార్డ్ సీజీఎం చిన్మయ్ కుమార్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ లైన్ దాటిన సుస్మిత

## సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు

## సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



**హైదరాబాద్,ఆగస్ట్19 :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.




# లోక్‌సభ సీట్లు యథాతథంగా కొనసాగించాలి

## అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19:** లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు. అరుణాలచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట

## ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం

**హైదరాబాద్, ఆగస్ట్ 19:** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు. అనామలీస్, నో- మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. ం÷ూఆఆ జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు ఫారం 6, 6ం, 7, 8పై ÷-లకెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

## సంపాదకీయం




# సవాళ్లను స్వీకరిస్తేనే ప్రజల ఆదరణ!

సవాళ్లను స్వీకరించకుండా..సమస్యలను పరిష్కరించకుండా ఎల్లకాలం పాలన సాగించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోతే ప్రజలు నిరంతరాయంగా ఓటేస్తారని అనుకోవడం కూడా పొరపాటే. ఈ దేశంలో మహామహులను ఓడించిన చరిత్ర ఉంది. భారతీయ జనతాపార్టీ కూడా ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది. ఇటీవల ఎర్రకోట మీదుగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించారు. దీనిపై ఎప్పుడో పార్లమెంట్ ఆమోదించినా, మళ్లీ ప్రధాని పదేపదే అదే విషయం ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇప్పుడున్న 542 లోక్‌సభ సీట్లకు మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఒకే సమస్యలను పదేపదే ఎత్తి చూపడం ద్వారా ప్రజల్లో కూడా విసుగు తెప్పిస్తుంది. ఇకపోతే డీలిమిటేషన్ కూడా రాజకీయ లబ్దికోసమే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో ఈ రెండు విషయాల్లో మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో గట్టెక్కించాలనుకున్న మోడీ ద్వయం వ్యూహం బెడిసి కొట్టిందనే చెప్పాలి.

ఈ క్రమంలో త్వరలోనే యూపి, పంజాబ్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకోసమేనా అన్నట్లుగా బిజెపి కూడా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించు కుంది. కొత్తగా కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం ద్వారా ముందుకు సాగాలని బిజెపి చూస్తోందనడానికి ఈ కూర్పు నిదర్శనంగా చూడాలి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. అయితే ఇది చెప్పుకోదగ్గ రీతిలో లేదు. ఎందుకంటే ప్రజలు ఆశిస్తున్నది ఇది కాదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి మార్పులు కావు. సమాజంలో వస్తున్న మార్పులపై స్పందించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత, విద్యార్థుల్లో ఆలోచనలు మారుతున్నాయి. జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న ఆలోచనలకు అనుగుణంగా బిజెపిలో మార్పు కనిపించడం లేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం గురించి చర్చించడం లేదని అనిపిస్తోంది. ఎందుకంటే యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో అనేకానేక సంస్కరణలు తీసుకుని వచ్చింది. మౌళికరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దేశంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. రోడ్డు, రైల్వే రంగాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఎన్నడూ ఊహించని విధంగా పురోభివృద్ధి కనిపిస్తోంది. అయితే విమానయానరంగం అందనంత ఎత్తులో ఉంది. తిరుపతికి వెళ్లాలంటే భయపడే స్థితలో విమాన టిక్కెట్ రేట్లు పెరిగాయి. విమయానయాన రంగాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇక అన్నింటికి మించి విద్యా,వైద్యరంగాలు నీరుగారి పోతున్నాయి. చదువుల, వైద్యం ప్రజలు భరించలేనంత భారంగా మారాయి. వీటిపై కేంద్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలి. అలాకాకుండా అభిజిత్ దీప్కేకు ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని వాదించడం సరికాదు. యువతలో వచ్చిన ఆందోళనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వారు ఏమి కోరుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నదన్నదే ముఖ్యం. కమలం పార్టీ బాగా విస్తరించిందని, తన కాళ్లమీద తాను నిలబడిందని, ప్రపంచంలో ఎవ్వరికీ లేని కార్యకర్తల బలం ఉందని విర్రవీగితే....ప్రజలు ఊదితే వచ్చే గాలిలో కొట్టుకు పోగలరు. పార్టీ వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ నిజానికి పటిష్టంగానే ఉందని ఒప్పుకోక తప్పదు. ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అయినా 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించింది. దీంతో ఎన్‌డిఎ బలంతో మళ్లీ పగ్గాలు చేపట్టింది. నిజానికి ఇదే ఓ హెచ్చరికగా బిజెపి తీసుకోవాలి. అలా కాకుండా ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల శక్తి పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. మద్దతు ఇస్తున్న పార్టీల్లో టిడిపి సైతం ఎదిరించే స్థితిలో లేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు కొంచెం దానినుంచి బయటకు వచ్చి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో మోడీ ద్వయం పెత్తనమే సాగుతోంది. ఇప్పుడు కొత్త కార్యవర్గ కూర్పులోనూ అదే కనిపిస్తోంది. అయితే ఇది చాలదని గుర్తించాలి. ప్రజలకు మంచి చేసుకోవడానికి ఇంకా మంచిపనులు అనేక చేయాలి. ధరలను అదుపు చేయడం మొదలు, నిరుద్యోగ యువతను ఉపాధి, ఉద్యోగాల బాట పట్టించడం ముఖ్యం.

# నీట్ లీక్‌పై సుప్రీం సీరియస్

- ఎన్‌టీఏలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిందే
- తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత వ్యవస్థ ఉండాలని స్పష్టీకరణ
- ప్రశ్నపత్రాల భద్రత, సైబర్ సెక్యూరిటీపై పూర్తి వివరాలు కోరిన ధర్మాసనం
- సంస్థాగత మార్పులపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
- ఎన్‌టీఏ సంస్కరణలను పర్యవేక్షిస్తామన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. జాతీయ పరీక్షల సంస్థలో తాత్కాలిక మార్పులతో సరిపెట్టకుండా శాశ్వత, సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన, పారదర్శకమైన వ్యవస్థ ఉండాల్సిందేనని పేర్కొంది. ఎన్‌టీఏలో ఇప్పటివరకు చేపట్టిన సంస్కరణలపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, ఎన్‌టీఏ సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ధర్మాసనం విచారించింది. పరీక్షల నిర్వహణలో పదేపదే సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ఒక్కో ఘటన జరిగినప్పుడు ఒక్కో చర్య తీసుకోవడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడింది. సమస్య మూలాలను గుర్తించి వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలని సూచించింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్ష కేంద్రాలకు చేరేవరకు అనుసరిస్తున్న భద్రతా విధానం, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. నీట్ సహా కీలక ప్రవేశ పరీక్షల భద్రతను నిరంతరం పర్యవేక్షించే శాశ్వత వ్యవస్థ అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఎన్‌టీఏను సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంతో పాటు పరీక్షల నిర్వహణలో లోపాలకు అవకాశం లేకుండా నిర్మాణాత్మక మార్పులు చేపట్టాలని సూచించింది. పరీక్షల నిర్వహణలో జరిగే తప్పిదాల ప్రభావం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై పడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు విశ్వాసం కలిగించే విధంగా వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడింది. ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తాయని పేర్కొంటూ భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు అవసరమని స్పష్టం చేసింది. ఎన్‌టీఏలో చేపట్టే సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ప్రశ్నపత్రాల భద్రత నుంచి పరీక్షల నిర్వహణ వరకు ఎన్‌టీఏ వ్యవస్థలో సమూల మార్పులకు సుప్రీంకోర్టు ఆదేశాలు కీలకంగా మారనున్నాయి.

# మౌలిక రంగానికి రూ.13 వేల కోట్ల బూస్ట్

- ఐదు భారీ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా
- నాలుగు రైల్వే ప్రాజెక్టులకు రూ.9,450 కోట్లు
- గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు రూ.2,229 కోట్లు
- బిహార్‌లో నాలుగు వరుసల రహదారికి రూ.3,591 కోట్లు
- రైల్వే రద్దీ తగ్గింపు.. సరుకు రవాణా సామర్థ్యం పెంపే లక్ష్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో రూ.9,450 కోట్ల విలువైన నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులతో పాటు బిహార్‌లో రూ.3,591 కోట్లతో చేపట్టనున్న నాలుగు వరుసల రహదారి ప్రాజెక్టు ఉంది. రైల్వే మార్గాల్లో పెరుగుతున్న రద్దీని తగ్గించడం, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడం, ప్రయాణికుల రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేయడం లక్ష్యంగా నాలుగు బహుళ మార్గాల ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. గూడూరు-గుమ్మిడిపుండి మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.2,229 కోట్లు కేటాయించారు. ఈ మార్గంలో అదనపు లైన్లు అందుబాటులోకి వస్తే రైళ్ల రాకపోకలకు మరింత వెసులుబాటు కలగడంతో పాటు సరుకు రవాణా వేగవంతం కానుంది. ఖరగ్‌పూర్-భద్రక్ నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ నాలుగో లైన్‌కు రూ.1,583 కోట్లు కేటాయించారు. కటక్-పారాదీప్ మధ్య మూడు, నాలుగో లైన్ల నిర్మాణానికి మరో రూ.2,286 కోట్లు వెచ్చించనున్నారు. ఈ నాలుగు రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే ఆయా మార్గాల్లో రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు అదనపు రైళ్లను నడిపేందుకు అవకాశం ఏర్పడనుంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలు, నౌకాశ్రయాలతో రైల్వే అనుసంధానం మరింత బలోపేతం కానుంది. మొత్తంగా సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా. బిహార్‌లో ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు రూ.3,591 కోట్ల ప్రాజెక్టుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే బిహార్‌లోని కీలక ప్రాంతాల మధ్య రహదారి అనుసంధానం మెరుగుపడటంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు ప్రయాణికులు, సరుకు రవాణాకు మరింత సౌలభ్యం కలగనుంది. రైల్వే, రహదారి రంగాలకు ఒకేసారి రూ.13 వేల కోట్లకు పైగా ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం ద్వారా దేశంలో మౌలిక సదుపాయాల విస్తరణకు కేంద్రం మరో ముందడుగు వేసింది.

# కశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదుల తరలింపు

### నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు

**లాహోర్, ఆగస్ట్ 19:** పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హాఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో అనేక దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హాఫీజ్‌పై పలు కేసులు నమోదయ్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్రవాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవేశించి నాలుగు రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి జమ్మూలోని కోర్టు హాఫీజ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి, అమెరికా కూడా ఎల్ఈటీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి.

# ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

### ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19:** ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఇరాన్ తమ దేశం వైపు క్షిపణిని ప్రయోగించిందన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఖండించారు. ఈ వాదన ప్రాంతీయ విశ్వాసానికి, భద్రతా ప్రయత్నాలకు హానికరమని ఆయన పేర్కొన్నారు.

# కోల్‌కతా హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

### అర్ధరాత్రి అగ్నికీలలు.. 9 మంది దుర్మరణం

### మృతుల్లో చిన్నారి.. అందరూ బంగ్లాదేశీయులే

### వైద్య చికిత్స కోసం వచ్చి మృత్యువాత



**కోల్‌కతా:** కోల్‌కతాలో అర్ధరాత్రి అగ్నికీలలు మృత్యుఘంటికలు మోగించాయి. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో చిన్నారి సహా తొమ్మిది మంది దుర్మరణం పాలయ్యారు. మృతులంతా బంగ్లాదేశ్‌కు చెందిన వారేనని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. వైద్య చికిత్స కోసం కోల్‌కతాకు వచ్చిన వారు హోటల్‌లో బస చేస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో హోటల్ మూడో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిద్రలో ఉన్నవారు ప్రమాదాన్ని గుర్తించి బయటపడేలోపే దట్టమైన పొగ, అగ్నికీలలు హోటల్‌ను చుట్టుముట్టాయి. పలువురు లోపలే చిక్కుకుపోయారు. కొందరు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అయితే చిన్నారి సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మూడో అంతస్తులోని ఏసీ పేలడం వల్లే తొలుత మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. అగ్నిమాపక, పోలీసు అధికారులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో చెలరేగిన అగ్నికీలలు సమీపంలోని ఇళ్లవైపు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నాలుగు అగ్నిమాపక వాహనాలతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. హోటల్‌లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. దట్టమైన పొగ కారణంగా సహాయక చర్యలకు కొంత అంతరాయం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితమే పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో ఓ హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. తాజాగా కోల్‌కతాలో మరో హోటల్‌లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.



# కశ్మీర్ భారత్‌లో కీలక భాగం

- ట్రావెల్ వార్నింగ్‌పై పునరాలోచన
- భారత్ వైఖరికి అమెరికా మద్దతు

జమ్మూకశ్మీర్‌పై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ బుధవారం శ్రీనగర్‌లో పర్యటించారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో ఒక ముఖ్యమైన భాగం అని స్పష్టంగా చెప్పారు. శ్రీనగర్ పర్యటన తనకు ఇదే తొలిసారి అని తెలిపారు. కశ్మీర్ ఎంతో అందమైన ప్రాంతమని, ఇక్కడికి రావడం తనకు ఆనందంగా ఉందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అమెరికా రాయబారి జమ్మూకశ్మీర్‌కు రావడం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### ఒమర్ అబ్దుల్లాతో కీలక భేటీ

అమెరికా రాయబారి గోర్ జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. ఈ భేటీలో అమెరికాభారత్ సంబంధాలతో పాటు జమ్మూకశ్మీర్ అంశంపై ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు ఒమర్ తెలిపారు. ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి కొన్ని పాత సమస్యలు ఉన్నాయని, వాటిని కాలక్రమంలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఒమర్ పేర్కొన్నారు. అమెరికా, న్యూఢిల్లీ, శ్రీనగర్ మధ్య చర్చలు భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ట్రావెల్ వార్నింగ్‌పై పునరాలోచన

కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడ్డాయని గోర్ ప్రశంసించారు. దీంతో అమెరికా తన పౌరులకు జారీ చేసిన జమ్మూకశ్మీర్ ట్రావెల్ అడ్వైజరీని తగ్గించే అంశాన్ని పరిశీలించే అవకాశం ఉందని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక మార్పు ప్రకటించలేదు. అమెరికా ప్రయాణ హెచ్చరికలో మార్పు వస్తే విదేశీ పర్యాటకుల రాకకు ఊతం లభించే అవకాశం ఉంది. కశ్మీర్‌ను సురక్షిత పర్యాటక ప్రాంతంగా ప్రపంచానికి చూపించే ప్రయత్నాలకు ఇది ఉపయోగపడొచ్చు. ముఖ్యంగా కశ్మీర్ భారత్‌లో భాగమనే వ్యాఖ్యతో పాటు ట్రావెల్ అడ్వైజరీపై పునరాలోచన చేస్తామన్న గోర్ మాటలు తాజా అమెరికా వైఖరిలో కీలక సంకేతంగా కనిపిస్తున్నాయి.



# విజయ్ ప్రభుత్వానికి 100 రోజులు

- కొత్త ప్రభుత్వానికి కీలక మైలురాయి

తమిళనాడులో తమిళగ వెట్రి కళగం... టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకుంది. ఆగస్టు 17తో ప్రభుత్వం వంద రోజుల పాలనను పూర్తి చేసింది. సినీ నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన సి. జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఈ ప్రభుత్వం తమిళనాడులో ఏర్పడిన తొలి నిజమైన సంకీర్ణ ప్రభుత్వంగా నిలిచింది. ముఖ్యంగా మంత్రివర్గంలో ఎక్కువ మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు ఉండటం ప్రారంభంలో అనేక సందేహాలకు కారణమైంది. అయినా ప్రభుత్వం ఏర్పడిన సమయంలో ఎలాంటి పెద్ద ఇబ్బందులు లేకుండా సంకీర్ణ మంత్రివర్గం కొలువుదీరడం ప్రభుత్వానికి తొలి విజయంగా నిలిచింది.

### సమయపాలనకు ప్రాధాన్యం

వంద రోజుల పాలనలో టీవీకే ప్రభుత్వం కొత్త తరహా పని విధానాన్ని చూపించే ప్రయత్నం చేసింది. మంత్రివర్గంలో వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, సమయపాలన పాటించడం, అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ పనులు వేగంగా జరిగేలా అధికారులు, మంత్రులతో సమన్వయం పెంచే ప్రయత్నం కనిపించింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉన్నప్పటికీ పాలనలో స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది.

### ఆర్థిక క్రమశిక్షణపై ప్రశ్నలు

అయితే వంద రోజుల పాలనపై పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితి ఇంకా లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఖర్చులు, నిర్ణయాల్లో పారదర్శకత వంటి అంశాలపై ప్రశ్నలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విధానాలపై భిన్నాభిప్రాయాలను ఎలా స్వీకరిస్తుందన్న అంశం కూడా చర్చకు వస్తోంది. కొత్త ప్రభుత్వం తన తొలి వంద రోజుల్లో పని విధానంలో మార్పు చూపించినా, దీర్ఘకాలంలో ఆ మార్పులు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడతాయన్నదే అసలు పరీక్ష. కొత్త శైలి పాలనను కొనసాగిస్తూ ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను కాపాడటం టీవీకే ప్రభుత్వానికి ప్రధాన సవాలుగా మారింది.

# టేబుల్‌పై డీఎంకే అవినీతి ఫైల్స్

- సమయం వస్తే ఫైల్స్ తెరుస్తా అసెంబ్లీలో విజయ్ హెచ్చరిక

తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనం రేపాయి. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన వద్ద ఉన్నాయని సీఎం తెలిపారు. డీఎంకే నేతలకు సంబంధించిన రెండు కీలక ఫైల్స్ ప్రస్తుతం తన టేబుల్‌పైనే ఉన్నాయని చెప్పారు. సమయం వచ్చినప్పుడు వాటిని తెరుస్తానని, తనను బలవంతం చేసి ఇప్పుడే ఆ ఫైల్స్ బయటకు తీసేలా చేయొద్దని విజయ్ హెచ్చరించారు. డీఎంకే పాలనలో రోడ్ల నిర్మాణ పనుల్లో అవకతవకలపై అసెంబ్లీలో చర్చ జరుగుతున్న సమయంలో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా విజయ్ స్పందిస్తూ ప్రజలకు ఎప్పుడు ఏం చెప్పాలో తనకు తెలుసని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల సమయంలో మాట్లాడతానని, అప్పటివరకు ప్రజలకు మంచి జరిగేలా చూడాలని వ్యాఖ్యానించారు. విజయ్ వ్యాఖ్యలతో తమిళనాడు రాజకీయాల్లో అవినీతి ఫైల్స్ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది.

# వెలుగొండతో నల్లమలకు కృష్ణా జలాలు

వెలుగొండ ప్రాజెక్టు ద్వారా ఈ నెలాఖరులో నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు అందిస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వాసితులకు సీఎం చంద్రబాబు నాయుడు రూ.200 కోట్ల పరిహారం చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను చంద్రబాబు నిజం చేస్తున్నారని అన్నారు. ప్రాజెక్టు పనులతో పాటు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ఇప్పటికే తొలి విడతగా రూ.318 కోట్లు చెల్లించామని, తాజాగా మరో రూ.200 కోట్లు అందించామని చెప్పారు. మిగిలిన రూ.400 కోట్లను త్వరలో చెల్లించి ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు నీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనత వైసీపీకి దక్కుతుందని మంత్రి విమర్శించారు. వెలుగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే ఇప్పుడు ప్రారంభోత్సవం చేస్తున్నారని తెలిపారు.

# కూటమిపై జంగ్ సైరన్

- ఎన్నికలే టార్గెట్‌గా జగన్ వ్యూహం
- స్థానిక పోరుకు శ్రేణులకు పిలుపు





స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. స్థానిక ఎన్నికలను కేవలం సాధారణ ఎన్నికలుగా కాకుండా కూటమి ప్రభుత్వానికి ప్రజల తీర్పుగా భావించి పనిచేయాలని సూచించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, దాన్ని ఎన్నికల్లో ఓట్లుగా మార్చేలా ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లాలని జగన్ పిలుపునిచ్చారు.

### పోలీసులైనా ఎదుర్కొని పోరాటం

స్థానిక ఎన్నికల్లో అధికార వ్యవస్థను ఉపయోగించి ప్రతిపక్షాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరగవచ్చని జగన్ ఆరోపించారు. ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గకుండా పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయని, ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు పెరిగాయని విమర్శించారు. రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంక హత్య ఘటనపై కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ, పోలీసులు కుమ్మక్కవుతున్నారని జగన్ విమర్శించారు.

### కూటమిపై వ్యతిరేకతే తమ బలం

చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని జగన్ ఆరోపించారు. విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనతో ప్రస్తుత కూటమి పాలనను ప్రజలు పోల్చి చూస్తున్నారని పేర్కొన్నారు. మరో ఏడాదిలో పాదయాత్ర ప్రారంభిస్తానని, ఆ తర్వాత ఏడాదిలో ఎన్నికలు వస్తాయని జగన్ తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేస్తూ.. ఇప్పటి నుంచే ప్రజల్లో ఉండి గెలుపు కోసం పనిచేయాలని శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# జగన్ 2.0

- మరోసారి పాదయాత్ర
- ఎన్నికల్లో మనదే విజయమన్న జగన్

రాజమండ్రి రూరల్ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో జగన్ పాదయాత్రపై మరోసారి క్లారిటీ ఇచ్చారు. మరో ఏడాదిలో పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ ప్రకటించారు. ఆ తర్వాత ఏడాదిలో ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు నిత్యం ప్రజలతో మమేకమై పనిచేయాలని జగన్ పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆయన విమర్శించారు. విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు ఏ వర్గం కూడా సంతృప్తిగా లేరని జగన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని అన్నారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీపై ప్రజాదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల తమ పాలనను ప్రస్తుత కూటమి పాలనతో ప్రజలు పోల్చి చూస్తున్నారని జగన్ తెలిపారు.

# జగన్ పాలనపై బాబు ఆరోపణలు

- గ్రూప్-1 అక్రమాల పుట్ట: చంద్రబాబు

గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయని సీఎం చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడారని మండిపడ్డారు. ఏపీపీఎస్సీ నిబంధనలను పక్కనపెట్టి జవాబు పత్రాల మూల్యాంకన బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారని ఆరోపించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో చేయించారని విమర్శించారు. హైదరాబాద్‌లో పేపర్లు దిద్దిన 25 మంది, హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం చేసిన 66 మంది అనర్హులేనని నివేదికలు చెబుతున్నాయని చంద్రబాబు తెలిపారు. మార్కులు తగ్గించడం, పెంచడం ఇష్టానుసారంగా జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారం మొత్తం వైసీపీ హయాంలో జరిగిన అతి పెద్ద స్కామ్ అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

### డూప్లికేట్ ఓఎంఆర్‌లపైనా ప్రశ్నలు

గ్రూప్ 1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో 55 చోట్ల తప్పులు సరిచేశారని, 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. పరీక్ష రాసిన ఓ లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారని ఆరోపించారు. కోర్టులను తప్పుదోవ పట్టించేలా తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేయించారని అన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ దర్యాప్తు ప్రారంభమైందని తెలిపారు. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు రావాల్సిన వ్యవస్థను పైరవీలకు వేదికగా మార్చారని జగన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ చంద్రబాబు విమర్శించారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

## అసెంబ్లీకి దూరంగా ఎందుకు?

### సభే ప్రజల గొంతుకన్న చంద్రబాబు

ఒక రాజకీయ పార్టీ మొత్తం అసెంబ్లీని బహిష్కరించడం తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని సీఎం చంద్రబాబు విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై చర్చించేందుకు శాసనసభే అత్యున్నత వేదిక అని అన్నారు. సమస్యలను సభలో ప్రస్తావిస్తేనే వాటికి గుర్తింపు, పరిష్కార మార్గం లభిస్తాయని చెప్పారు. బయట కూర్చొని ఎంత మాట్లాడినా ప్రజలకు పెద్దగా ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. గత రాజకీయ అనుభవాలను గుర్తుచేస్తూ 1978లో వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి సభలో ప్రజా సమస్యలపై గట్టిగా మాట్లాడేవారని తెలిపారు. 198994 మధ్య ఎన్టీఆర్ కొన్ని రోజులు సభకు దూరంగా ఉన్నప్పటికీ, తామంతా పార్టీ తరపున అసెంబ్లీలో ప్రజల కోసం పోరాడామని చంద్రబాబు పేర్కొన్నారు.

### గ్రూప్-1 నుంచి బీసీ రిజర్వేషన్ల వరకు

201924 మధ్య తాను సభలో సవాల్ చేసి బయటకు వచ్చిన సందర్భంలో కూడా తమ ఎమ్మెల్యేలు చివరి రోజు వరకు ప్రజా సమస్యలను ప్రస్తావించారని చంద్రబాబు చెప్పారు. గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన అక్రమాలపై చర్చను ఎదుర్కోలేకే ప్రతిపక్షం సభకు దూరంగా ఉంటోందని ఆరోపించారు. డీఎస్సీ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం తగ్గించిన బీసీ రిజర్వేషన్లను తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణ చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరని చంద్రబాబు వ్యాఖ్యానించారు.



# యూట్యూబ్ ఆదాయం... ఇన్‌స్టాగ్రామ్ సంపాదన

- ఇకపై పన్ను కట్టండి... క్రియేటర్ల ఆదాయంపై ఐటీ కన్ను

**జాక్‌పాట్ కొట్టేస్తున్నారా? అయితే పన్ను కట్టండి! చేతిలో మొబైల్.. ముందు కెమెరా.. వెనుక లక్షల వ్యూస్.. బ్యాంక్ ఖాతాలోకి వరుసగా డబ్బులు! యూట్యూబ్‌లో వీడియో పెట్టి, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసి సంపాదిస్తున్నారా? అయితే ఇకపై సంపాదనను దాచిపెట్టే ఛాన్స్ లేదు. సోషల్ మీడియా కేవలం టైంపాస్ వేదిక కాదు.. చాలామందికి అదే ఇప్పుడు ఫుల్‌టైమ్ బిజినెస్. వీడియోలతో వచ్చే డబ్బు, బ్రాండ్ ప్రమోషన్లు, అఫిలియేట్ కమిషన్లు, మెంబర్‌షిప్‌లు.. ఇలా ఏ రూపంలో ఆదాయం వచ్చినా లెక్కలోకి తీసుకోవాల్సిందే. ప్రభుత్వం కొత్తగా క్రియేటర్లపై ప్రత్యేక పన్ను వేయడం లేదు. ఇప్పటికే ఉన్న ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారమే సోషల్ మీడియా ఆదాయాన్ని పరిగణిస్తోంది. అంటే వ్యూస్ పెరిగితే ఆదాయం పెరగొచ్చు.. ఆదాయం పెరిగితే పన్ను బాధ్యత కూడా రావచ్చు. మరి ఎంత సంపాదిస్తే పన్ను కట్టాలి? ఏ ఆదాయానికి ఎంత పన్ను? ఏ ఖర్చులకు మినహాయింపు ఉంటుంది? ఆగస్టు 31లోపు ఏం చేయాలి? సోషల్ మీడియాలో జాక్‌పాట్ కొట్టేస్తున్న క్రియేటర్లు ఇప్పుడు తెలుసుకోవాల్సింది ఇదే!**

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డబ్బు సంపాదిస్తున్న వారు ఆ ఆదాయాన్ని ఆదాయపు పన్ను లెక్కల్లో చూపించాలి. యూట్యూబ్ నుంచి వచ్చే యాడ్‌సెన్స్ డబ్బు, ఇన్‌స్టాగ్రామ్ బ్రాండ్ ప్రమోషన్లు, అఫిలియేట్ కమిషన్లు, మెంబర్‌షిప్‌లు, ఇతర చెల్లింపులు అన్నీ ఆదాయంగానే పరిగణిస్తారు. సోషల్ మీడియా ద్వారా వస్తున్న డబ్బు పన్ను రహితం కాదు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్‌ను ఆగస్టు 31, 2026లోపు దాఖలు చేయాలి. ఆదాయం ఉన్న ప్రతి క్రియేటర్ తనకు వచ్చిన డబ్బు వివరాలను సరిగా నమోదు చేసుకోవాలి. ఖర్చులకు సంబంధించిన బిల్లులు కూడా భద్రంగా ఉంచుకోవాలి.

### ప్రభుత్వం ఏం చేస్తోంది?

క్రియేటర్లు ఎంత సంపాదిస్తున్నారు, ఎంత పన్ను చెల్లించాలి అనే విషయాలను ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం పరిశీలిస్తుంది. ఆదాయం ఎక్కువగా ఉంటే ఆదాయపు పన్నుతో పాటు కొన్ని సందర్భాల్లో జీఎస్టీ, టీడీఎస్ నిబంధనలు కూడా వర్తించవచ్చు. కంటెంట్ తయారీ కోసం చేసిన కెమెరా, కంప్యూటర్, సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్ వంటి కొన్ని ఖర్చులకు నిబంధనల ప్రకారం మినహాయింపులు పొందే అవకాశం ఉంటుంది. అందుకే క్రియేటర్లు తమ ఆదాయం, ఖర్చుల వివరాలను సరిగ్గా ఉంచుకోవడం ముఖ్యం. ప్రభుత్వం కొత్తగా యూట్యూబర్లపై ప్రత్యేక పన్ను వేయడం కాదు. ఇప్పటికే ఉన్న పన్ను నిబంధనల ప్రకారమే సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆదాయాన్ని లెక్కలోకి తీసుకుంటోంది. ఆదాయం ఉంటే రిటర్న్‌లో చూపించి, వర్తించే పన్ను చెల్లించాల్సిందే.

# తొమ్మిది నెలల తర్వాత ఫ్యామిలీతో భేటీ

- సుప్రీంకోర్టు ఆదేశాలతో కలిసిన ఇమ్రాన్‌ఖాన్

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తొమ్మిది నెలల తర్వాత తొలిసారి కుటుంబ సభ్యులను కలిశారు. రావల్పిండిలోని అడియాలా జైలులో ఆయన తన భార్య బుష్రా బీబీ, సోదరి నూరీన్ నియాజీని కలిశారు. ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి జైలులో ఉన్నారు. ప్రస్తుతం అల్‌ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో 14 ఏళ్ల శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన ఆరోగ్యంపై ఆందోళనలు వ్యక్తం కావడంతో కుటుంబ సభ్యులతో వారానికి ఒకసారి భేటీకి పాకిస్థాన్ సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ ఏడాదిలో తొలిసారి కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఆయనకు లభించింది.

### 15 నిమిషాల పాటు సోదరితో

ఇమ్రాన్ ఖాన్ సోదరి నూరీన్ నియాజీ ఆయనను సుమారు 15 నిమిషాల పాటు కలిశారు. జైలు కాన్ఫరెన్స్ రూమ్‌లో జరిగిన ఈ భేటీలో ఇమ్రాన్ ఆరోగ్యం, ఇతర అంశాలపై మాట్లాడినట్లు జైలు వర్గాలను ఉటంకిస్తూ పాకిస్థాన్ మీడియా తెలిపింది. సుప్రీంకోర్టు ఇమ్రాన్‌ను వైద్య పరీక్షల కోసం షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించాలని ఇచ్చిన ఆదేశాల గురించి కూడా నూరీన్ ఆయనకు వివరించారు. అయితే ఇమ్రాన్ సోదరీమణులు అలీమా ఖాన్, ఉజ్మా ఖాన్, బంధువు ఖాసిం జమాన్‌ను కలవడానికి అనుమతించలేదు. ఆయన పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు కూడా భేటీకి అవకాశం ఇవ్వలేదు.



### బుష్రా బీబీతో ప్రత్యేక భేటీ

ఇమ్రాన్ ఖాన్ భార్య బుష్రా బీబీ కూడా అదే జైలులో ఉన్నారు. ఆమె మంగళవారం కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జైలు వర్గాల ప్రకారం, ఇమ్రాన్ ఖాన్‌తో బుష్రా బీబీ భేటీ సుమారు 30 నుంచి 35 నిమిషాల పాటు జరిగింది. బుష్రా తన పిల్లలు మూసా, ముబష్షిరా మనేకా, వదిన మెహ్రున్నిసాను కూడా కలిశారు. ఇదిలా ఉండగా, కుటుంబ భేటీలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తే ఇచ్చిన వెసులుబాటును రద్దు చేస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇమ్రాన్ ఆరోగ్యంపై మరోసారి విచారణ జరగనున్న సెప్టెంబర్ 16 వరకు వైద్య చికిత్సపై కోర్టు నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి.

# యూట్యూబ్ వెంటపడిన ఏఐ ఏజెంట్

**ఇప్పటివరకు మనిషి యంత్రాలను నడిపించాడు. ఇకపై యంత్రాలే మనిషి పనులను నడిపించే రోజులు దగ్గరపడుతున్నాయి. ఏఐ వేగం చూస్తుంటే ఇది భవిష్యత్తు కథ కాదు.. మన కళ్లముందే జరుగుతున్న మార్పు. ఒకప్పుడు గంటలు పట్టిన పని నిమిషాల్లో పూర్తవుతోంది. ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య, వైద్యం, మీడియా.. ఇలా ప్రతి రంగంలోకి ఏఐ దూసుకొస్తోంది. అయితే ఇదే వేగం రేపటి రోజుల్లో కొత్త తలనొప్పులకు దారితీయొచ్చు. మనిషి చేసే పనిని ఏఐ చేస్తే ఉద్యోగాల పరిస్థితి ఏంటి? ఏఐ తయారు చేసిన వార్త నిజమో, అబద్ధమో ఎలా గుర్తించాలి? మన గొంతు, ముఖం, ఫొటోతో నకిలీ వీడియోలు తయారైతే పరిస్థితి ఏంటి? మన నిర్ణయాలపై ఏఐ ప్రభావం పెరిగితే మన స్వేచ్ఛ ఎంతవరకు మిగులుతుంది? అంతకంటే పెద్ద ప్రశ్న.. మనిషి నియంత్రణ దాటితే ఏఐను ఎవరు ఆపగలరు? సౌకర్యం కోసం సృష్టించిన ఏఐ.. రేపు మనిషికే సవాలుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. రానున్న రోజుల్లో ఏఐతో పోటీ కాదు.. ఏఐతో కలిసి బతకడం నేర్చుకోవడమే అసలు పరీక్ష**

- పని చేయడం మాని యూట్యూబ్ వైపు
- ఏఐతో కల్లోలం... మానవాళికి సవాళ్లు

ఏఐతో పని చేయిస్తే అది చెప్పిన పని చకచకా పూర్తి చేస్తుందని అనుకుంటాం. కానీ ఓ ఏఐ ఏజెంట్ మాత్రం పని మధ్యలో యూట్యూబ్ వెంటపడింది. కంప్యూటర్‌ను పూర్తిగా ఉపయోగించే అవకాశం ఇచ్చిన తర్వాత క్లాడ్ కోడ్ ఏజెంట్ పదేపదే యూట్యూబ్ ఓపెన్ చేసింది. యూట్యూబ్‌ను మూసేసినా మళ్లీ అదే సైట్ తెరవడంతో ఈ వ్యవహారం ఆసక్తికరంగా మారింది.

### యూట్యూబ్ ఎందుకు తెరిచిందో

ఈ విషయాన్ని ఏఐ కామెంటేటర్ వెస్ రోత్ సోషల్ మీడియాలో వెల్లడించారు. యూట్యూబ్ ఎవరు తెరిచారో తెలుసుకునేందుకు ఏఐ ఏజెంట్లు ఒకదానితో ఒకటి మాట్లాడుకున్నాయి. కానీ చివరకు ఏ ఏజెంట్ ఈ పని చేసిందో వాటికే స్పష్టంగా తెలియలేదు. దీంతో ఒక ఏజెంట్ మరో ఏజెంట్‌ను తప్పుపట్టడం మొదలుపెట్టింది. తప్పు చేసిన ఏజెంట్‌ను గుర్తించి తొలగించేందుకు కూడా ప్రయత్నించింది.



### అసలు కారణం గేమ్ వీడియోలు

రోత్ తన కంప్యూటర్‌లో క్లాడ్ కోడ్‌ను పూర్తి ఆటోమేటిక్ మోడ్‌లో పెట్టారు. ఎస్కేప్ ఫ్రమ్ టార్కోవ్ గేమ్‌కు సంబంధించిన వికీ తయారు చేయడం, వాయిస్ ఆధారిత ఏఐ అసిస్టెంట్ రూపొందించడం వంటి పనులు ఏజెంట్లకు అప్పగించారు. గేమ్‌కు సంబంధించిన సమాచారం తెలుసుకునే క్రమంలో ఏజెంట్లు యూట్యూబ్ వీడియోలను చూడాల్సి వచ్చింది. అదే సమయంలో యూట్యూబ్ పదేపదే తెరుచుకున్నట్లు రోత్ గుర్తించారు.

### సరదా ఘటన.. పెద్ద హెచ్చరిక

ఈ ఘటన బయటకు చూస్తే సరదాగా అనిపిస్తుంది. కానీ ఏఐ ఏజెంట్లకు ఎంత స్వేచ్ఛ ఇవ్వాలనే విషయంలో ఇది ఒక హెచ్చరికగా మారింది. ఇప్పుడు ఏఐ ఏజెంట్లు బ్రౌజర్, ఫైల్స్, ఇతర కంప్యూటర్ టూల్స్‌ను స్వయంగా ఉపయోగించగలుగుతున్నాయి. మనం ఇచ్చిన పనిని పూర్తి చేసే క్రమంలో అవి ఊహించని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే రోత్ ప్రకారం చివరకు ఈ ఏఐ ఏజెంట్లతో మంచి ఫలితమే వచ్చింది. తార్కోవ్ గేమ్ కోసం తయారు చేసిన ఏఐ కోచ్ కూడా బాగా పనిచేసింది. కొందరు నెటిజన్లు తమకూ ఇలాంటి అనుభవాలు ఎదురయ్యాయని చెప్పారు. ఏఐ ఎంత తెలివిగా పనిచేసినా, దానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చే ముందు మనిషి పర్యవేక్షణ ఉండాల్సిందేనని ఈ ఘటన స్పష్టం చేసింది.

## తెలంగాణే బలం.. తెలంగాణే బలగం మళ్లీ పుంజుకునేనా బీఆర్ఎస్..

తెలంగాణ రాష్ట్ర సమితి... తెలంగాణ రాష్ట్రం కోసం పుట్టిన పార్టీ. తెలంగాణ వాదం... ఆ పార్టీకి కేవలం రాజకీయ సిద్ధాంతం కాదు. అదే ఊపిరి, అదే ఆయుధం, అదే బలం, అదే ఓటు బ్యాంకు. కేసీఆర్ అనే నాయకుడి రాజకీయ ప్రయాణం నుంచి టీఆర్ఎస్ ఆవిర్భావం వరకు, తెలంగాణ ఉద్యమం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు... ప్రతి అడుగులోనూ ఒకే నినాదం వినిపించింది. తెలంగాణ ఇచ్చుడో.. సచ్చుడో..! ఆ నినాదమే కేసీఆర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లింది. అదే నినాదం ఆయనను జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన నాయకుడిగా నిలబెట్టింది. చివరకు అదే తెలంగాణ సెంటిమెంట్ ఆయనకు పదేళ్ల పాటు అధికారాన్ని కూడా అందించింది. కేసీఆర్ స్వరం తెలంగాణ. ఆయన ప్రసంగాల్లో తెలంగాణ. ఆయన రాజకీయ వ్యూహాల్లో తెలంగాణ. ఉద్యమ సమయంలో ఆయన వెంట నడిచిన నేతల స్వరంలోనూ తెలంగాణే. ఆయన తనయుడు కేటీఆర్ రాజకీయంగా ఎదిగిన తర్వాత కూడా తెలంగాణ బ్రాండ్‌నే ముందుకు తీసుకెళ్లారు. కుమార్తె కవిత సైతం తెలంగాణ హక్కులు, తెలంగాణ ప్రయోజనాల పేరుతోనే రాజకీయ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అంటే టీఆర్ఎస్ అనే రాజకీయ సంస్థకు తెలంగాణ వాదం ఒక భావజాలం మాత్రమే కాదు.. పార్టీని ప్రజలతో అనుసంధానించే ప్రధాన బంధం.







### • ఉద్యమం నుంచి అధికార పీఠం... కేసీఆర్ ప్రస్థానం

తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో కేసీఆర్ ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. విమర్శలు ఎదుర్కొన్నారు. రాజకీయ ఒడిదుడుకులు చూశారు. ఒక దశలో ఆయన రాజకీయ జీవితం ముగిసిపోయిందనే వ్యాఖ్యలు కూడా వచ్చాయి. కానీ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న కొద్దీ కేసీఆర్ రాజకీయ బలం పెరిగింది. ఉద్యమం ఉధృతమైన కొద్దీ ఆయన చుట్టూ ప్రజలు సమీకృతమయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఉద్యమమే అధికారానికి మెట్లుగా మారింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ప్రచారం చేసుకున్నప్పటికీ.. తెలంగాణ సాధించిన నాయకుడిగా కేసీఆర్ ప్రజల మద్దతు పొందారు. ఇది సాధారణ రాజకీయ విజయం కాదు. ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీకి వచ్చిన రాజకీయ బహుమతి. తెలంగాణ సెంటిమెంట్ ఎంత బలమైనదో నిరూపించిన ఎన్నిక. ఆ తర్వాత ఐదేళ్ల పాలనలో కేసీఆర్ తన పరిపాలనా ముద్రను వేసుకున్నారు. సంక్షేమ పథకాలు, రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ అభివృద్ధి అనే నినాదాలను కలిపి ప్రజల్లోకి వెళ్లారు. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లి మరోసారి అధికారాన్ని దక్కించుకున్నారు. అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా టీఆర్ఎస్‌కు ఉద్యమ సెంటిమెంట్ రాజకీయ మూలధనంగానే పనిచేసింది.

### • తెలంగాణ దాటి జాతీయ రాజకీయాలతో కల్లోలం

అయితే ఇక్కడే కథలో కీలక మలుపు మొదలైంది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ.. తెలంగాణను దాటి దేశ రాజకీయాల్లోకి వెళ్లాలని నిర్ణయించుకుంది. టీఆర్ఎస్ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చారు. లక్ష్యం పెద్దదే. జాతీయ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలి. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీగా రూపాంతరం చెందాలి. వివిధ రాష్ట్రాల్లో రాజకీయ కార్యకలాపాలు విస్తరించాలి. కేసీఆర్ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లతో ఇతర రాష్ట్రాల పర్యటనలు మొదలుపెట్టారు. రైతు మోడల్, తెలంగాణ మోడల్ అంటూ దేశవ్యాప్తంగా ప్రచారం చేయాలనే ప్రయత్నం జరిగింది. కానీ రాజకీయాల్లో ప్రతి విస్తరణ విజయవంతం కాదు. ముఖ్యంగా ఒక ప్రాంతీయ పార్టీ తన మూలాలను ఎంత బలంగా పట్టుకుని ఉందో అదే దాని భవిష్యత్తును నిర్ణయిస్తుంది. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారిన క్షణంలోనే ఆ పార్టీ తన అసలు రాజకీయ గుర్తింపుపై ప్రయోగం ప్రారంభించింది. తెలంగాణ కోసం పుట్టిన పార్టీ.. తెలంగాణను దాటి దేశాన్ని గెలుస్తామని చెప్పడం ప్రజలకు ఎంత వరకు సహజంగా అనిపించింది? ఇదే అసలు ప్రశ్న. టీఆర్ఎస్ పేరు తెలంగాణతో నేరుగా ముడిపడి ఉంది. ఆ పేరులోనే ఒక ఉద్యమ చరిత్ర ఉంది. వేలాది మంది ఉద్యమకారుల జ్ఞాపకాలు ఉన్నాయి. విద్యార్థుల పోరాటం ఉంది. ఉద్యోగుల ఉద్యమం ఉంది. రైతుల ఆకాంక్ష ఉంది. తెలంగాణ ఆత్మగౌరవం ఉంది. ఆ పేరును తొలగించి బీఆర్ఎస్ అనే జాతీయ ముద్రను తీసుకురావడం ద్వారా పార్టీ తన మూల రాజకీయ గుర్తింపులోనే మార్పు చేసింది.

# అజ్ఞాతం నుంచి అధినేత డైరెక్షన్

## సెంటిమెంట్ ను రగిల్చేందుకు సీక్రెట్ ఆపరేషన్

**• సర్కారు ఏర్పాటుకు పావులు కదుపుతున్న సార్ • ఉద్యమ బాటలో దూసుకుపోతున్న కార్**

### • కుటుంబ పాలన ముద్రతో బీఆర్ఎస్‌కు దెబ్బ

కేసీఆర్ పాలనలో ఒకే ఒక్కటి అందరూ మరచిపోలేనిది. పాలన అంతా ఒక కుటుంబం చేతిలోనే కేంద్రీకృతమైపోయింది. సామాజిక తెలంగాణ కోసం కొట్లాడితే దొరల తెలంగాణ పాలైందన్న భావన సామాన్యుల్లోనూ బహుజనుల్లోనూ విన్పించింది. ఎక్కడ చూసినా, ఎటు చూసినా ఆ నలుగురే అంతా చేస్తున్నారు. వాళ్లదే హవా అన్న భావన సామాన్యుల్లో ఎక్కువైపోయింది. ఇప్పటికే కొన్ని వర్గాల్లో కాంగ్రెస్ పార్టీపై విముఖత వచ్చినా.. వామ్మో మళ్లీ బీఆర్ఎస్, కేసీఆర్.. అంటే ఆలోచించే పరిస్థితి ఉందన్న భావన ఉంది. కేసీఆర్ గురించి చెప్పే ప్రతిసారి ఆయనో ఎన్టీఆర్. ఆయనో వైఎస్సార్ అన్న భావన మెండుగా ఉంటుంది. కానీ ఆయన రెండోసారి 88 అసెంబ్లీ సీట్లను గెలిచిన తర్వాత కూడా వేట మొదలుపెట్టి పార్టీలను చీల్చేస్తే రాజకీయం అయిపోతుందన్న భావనతో రాజకీయాలు చేశారని.. అందుకే అసలు సమస్య వచ్చిందని.. చాలా మంది చెప్తారు. కానీ కేసీఆర్ ముద్ర తెలంగాణ రాజకీయాల్లో ఎవరూ పూడ్చలేనిది. నేటికీ కేసీఆర్ అంటే జనంలో అదే రెస్పాన్స్ ఉంది. కానీ నాటి భావనను చెరిపేసేలా కాంగ్రెస్ పార్టీ అవినీతి కథలంటూ ప్రచారం చేస్తోంది. కుటుంబ పాలనంటోంది. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ లభించిందంటోంది. ఈ మొత్తం కథను తమవైపునకు మార్చుకోవడం ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ ముందే ఉంది. అందుకే బీర్ఎస్‌కు కథ ముగిసిపోయాయని చెప్పడం తొందరపాటు. 2034 వరకు తానే సీఎం అన్న రేవంత్ రెడ్డికి ఆ టాస్క్ అంత ఈజీయేం కాదు.. ఎందుకంటే 2004లో అఖండ విజయం సాధించిన వైఎస్సార్ 2009లో గెలవడం కోసం ఎంత కష్టపడాల్సి వచ్చిందో చూశాం. సంక్షేమాన్ని ఇక ఎవ్వరూ చేయలేనంతగా చేసిన ఆయనకే అలాంటి పరిస్థితి వస్తే రేవంత్ గానీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గానీ వేరే చెప్పాల్సిన అవసరం లేదనుకోవచ్చు. కవిత కథకు సుఖాంతం కచ్చితంగా బీఆర్ఎస్‌కు అత్యంత కీలకం.

### • తెలంగాణ మనసు గెలిస్తే బీఆర్ఎస్‌కు పునరాగమనం

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఇప్పటికీ గట్టి క్యాడర్ ఉంది. పదేళ్ల పాలనలో ఏర్పడిన సంస్థాగత నిర్మాణం ఉంది. గ్రామస్థాయిలో కార్యకర్తల నెట్‌వర్క్ ఉంది. ముఖ్యంగా కేసీఆర్ నాయకత్వంపై ఇప్పటికీ విశ్వాసం ఉన్న వర్గం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగితే ఆ ఖాళీని బీఆర్ఎస్ భర్తీ చేసే అవకాశం కూడా ఉంది. కానీ అందుకు ఒక షరతు ఉంది. బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్ ఆత్మను వెతుక్కోవాలి. తెలంగాణ కోసం పుట్టిన పార్టీగా ప్రజలతో ఉన్న భావోద్వేగ బంధాన్ని పునరుద్ధరించాలి. జాతీయ రాజకీయాల విస్తరణ కన్నా ముందుగా తెలంగాణలో తన పునాదులను పటిష్టం చేసుకోవాలి. ప్రజల మధ్యకు వెళ్లాలి. క్యాడర్‌ను మళ్లీ యాక్టివ్ చేయాలి. యువతను ఆకర్షించే కొత్త రాజకీయ ఎజెండాను రూపొందించాలి. కేసీఆర్ రాజకీయ జీవితంలో ఒక ఆసక్తికరమైన వ్యంగ్యం ఉంది. తెలంగాణ వస్తే తన రాజకీయ జీవితం ముగుస్తుందని ప్రత్యర్థులు భావించిన సమయంలో తెలంగాణే ఆయనకు అధికారాన్ని ఇచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత దేశ రాజకీయాల్లోకి వెళ్లాలని ప్రయత్నించినప్పుడు అదే రాజకీయ విస్తరణ ఆయన పార్టీని బలహీనపరిచింది. అంటే కేసీఆర్ బలమూ తెలంగాణే.. బలహీనతకు కారణమైన మలుపూ తెలంగాణకు దూరమవ్వాలనే ఆలోచనే. అందుకే బీఆర్ఎస్‌కు ఇప్పుడు పెద్ద ప్రశ్న దేశాన్ని గెలుస్తామా? అన్నది కాదు. ముందుగా తెలంగాణ మనసును మళ్లీ గెలుస్తామా? అన్నదే.

### బీఆర్ఎస్ భవిష్యత్‌కు అసలు చిరునామా తెలంగాణే

టీఆర్ఎస్ పేరు ఒకప్పుడు పార్టీకి ఓటు తెచ్చింది. తెలంగాణ వాదం పార్టీకి ప్రజల హృదయంలో స్థానం ఇచ్చింది. కేసీఆర్ స్వరం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిధ్వనించింది. ఇప్పుడు అదే బంధాన్ని మళ్లీ నిర్మించాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉంది. పేరు మార్చినంత మాత్రాన పార్టీ స్వభావం మారదు. కానీ పార్టీ తన మూలాన్ని మరిచిపోతే మాత్రం ఓటరు పార్టీని మర్చిపోవచ్చు. తెలంగాణ కోసం పుట్టిన పార్టీకి తెలంగాణే మొదటి చిరునామా. ఆ చిరునామాను వదిలి దేశం చుట్టూ తిరిగితే జాతీయ పార్టీ కావచ్చు.. కానీ తన అసలు బలం మాత్రం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న రాజకీయ సంక్షోభానికి ఇదే ప్రధాన కారణం. బీఆర్ఎస్‌కు పాత పేరు కేవలం పేరు కాదు. అది ఒక ఉద్యమ జ్ఞాపకం. ఒక రాజకీయ చరిత్ర. ఒక భావోద్వేగం. ఒక ఓటు బ్యాంకు. అందుకే బీఆర్ఎస్ భవిష్యత్తు ఢిల్లీలో కాదు.. ముందుగా తెలంగాణ గడ్డపైనే తేలాలి. తెలంగాణ వాదమే పార్టీని పుట్టించింది. అదే వాదం మళ్లీ పార్టీని నిలబెట్టగలదా? కాలమే సమాధానం చెప్పాలి.

### • భవిష్యత్ ప్రయాణం... చిక్కుముడులు

తెలంగాణ కోసం పుట్టిన బీఆర్ఎస్ ఇప్పుడు తన రాజకీయ జీవితంలోనే అత్యంత కీలక దశలో ఉంది. ఒకప్పుడు తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ అనే స్థాయిలో ఉన్న పార్టీకి ఇప్పుడు అదే భావోద్వేగాన్ని మళ్లీ రగిలించడం పెద్ద సవాలుగా మారింది. పదేళ్ల అధికారంతో వచ్చిన బలం, 2023 ఓటమితో వచ్చిన బలహీనతగా మారింది. పేరు మారింది.. రాజకీయ లక్ష్యం మారింది.. కానీ ప్రజల మనసులో పార్టీకి పాత గుర్తింపే ఇంకా ఉంది. బీఆర్ఎస్‌కు కేసీఆర్ ఇప్పటికీ అతిపెద్ద బలం. అదే సమయంలో ఆయన చుట్టూనే పార్టీ మొత్తం తిరగడం బలహీనతగా మారే ప్రమాదం ఉంది. కేటీఆర్, హరీశ్‌రావు వంటి నేతలు పార్టీని ముందుకు నడిపిస్తున్నా.. కేసీఆర్ స్థాయిలో తెలంగాణ భావోద్వేగాన్ని మళ్లీ కదిలించే నాయకత్వం అవసరం. క్యాడర్‌ను కాపాడుకోవడం, వలసలను అడ్డుకోవడం, గ్రామస్థాయిలో పార్టీని మళ్లీ యాక్టివ్ చేయడం తక్షణ కర్తవ్యం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్‌కు మరో అవకాశం తెరుచుకుంది. ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే దాన్ని ఓట్లుగా మలచుకోవాలి. కానీ కేవలం కాంగ్రెస్ వైఫల్యాల కోసం ఎదురుచూస్తే సరిపోదు. తాము ఎందుకు తిరిగి రావాలనే దానికి ప్రజలకు కొత్త సమాధానం చెప్పాలి. తెలంగాణ వచ్చిన తర్వాతి తరానికి కొత్త ఎజెండా ఇవ్వాలి. బీఆర్ఎస్ ముందు ఇప్పుడు మూడు దారులు.. తెలంగాణకు మళ్లీ అంకితమవ్వడం, పార్టీని క్షేత్రస్థాయిలో పునర్నిర్మించడం, నాయకత్వంపై ఉన్న సందేహాలను తొలగించడం. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు, అధికార అహంకారం వంటి ముద్రలను చెరిపేయాలి. లేకపోతే ఉద్యమ చరిత్ర క్రమంగా జ్ఞాపకంగా మిగిలిపోతుంది. కేసీఆర్‌కు ఉన్న రాజకీయ ముద్రను ఎవరూ తుడిచేయలేరు. కానీ ఆ ముద్రను మళ్లీ ఓటుగా మార్చడం మాత్రం అంత ఈజీ కాదు. బీఆర్ఎస్ ముందు యుద్ధం ప్రత్యర్థులతో కాదు.. తన పాత బలాన్ని తిరిగి సంపాదించుకోవడమే. తెలంగాణ గుండెల్లో మళ్లీ చోటు దక్కితే పునరాగమనం సాధ్యం. లేదంటే చరిత్రలో ఒక గొప్ప ఉద్యమ పార్టీగా మిగిలిపోవడమే.

### • పదేళ్ల పాలనకు ప్రజల నుంచి ఎదురుదెబ్బ

ఇదే సమయంలో ప్రజల్లో మరో భావన కూడా పెరిగింది. తెలంగాణ కోసం పోరాడిన పార్టీ.. ఇప్పుడు దేశ రాజకీయాల్లో ఎందుకు అడుగు పెడుతోంది? తెలంగాణలో ఇంకా చేయాల్సిన పనులు ఉండగానే ఇతర రాష్ట్రాలపై ఎందుకు దృష్టి పెడుతోంది? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ ప్రశ్నలకు పార్టీ ఇచ్చిన సమాధానాలు రాజకీయంగా బలమైన ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఫలితంగా తెలంగాణ వాదం అనే భావోద్వేగానికి జాతీయ రాజకీయాల ప్రయోగం ఒక దశలో విరుద్ధంగా కనిపించింది. అంతేకాదు.. అధికారంలో పదేళ్లు ఉన్న తర్వాత సహజంగానే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుంది. అదే సమయంలో పార్టీ, ప్రభుత్వం, నాయకత్వం మధ్య ఉన్న తేడా కూడా ప్రజలకు కనిపించడం మొదలవుతుంది. కేసీఆర్ పాలనపై వచ్చిన విమర్శలు, ఎమ్మెల్యేలపై ఉన్న అసంతృప్తి, ప్రజలకు అందుబాటులో లేరనే భావన, నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలు, రైతుల సమస్యలు వంటి అంశాలు క్రమంగా ప్రతిపక్షాలకు ఆయుధాలుగా మారాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కొత్త ఊపిరి పీల్చుకుంది. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీగా చెప్పుకున్న కాంగ్రెస్.. ఉద్యమ ఫలితాలను తమ రాజకీయ ఖాతాలోకి తీసుకురావడానికి ప్రయత్నించింది. బీఆర్ఎస్‌పై ఏర్పడిన అసంతృప్తిని కాంగ్రెస్ సమర్థంగా రాజకీయ ఓట్లుగా మార్చుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే జరిగింది. తెలంగాణ కోసం పుట్టిన పార్టీగా పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ గద్దె దించింది.

### తెలంగాణ సెంటిమెంట్ నుంచి గుర్తింపు సంక్షోభం వరకు

ఇది కేవలం అధికార మార్పిడి కాదు. తెలంగాణ సెంటిమెంట్‌పై తమకు శాశ్వత హక్కు ఉందని భావించిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఇచ్చిన రాజకీయ హెచ్చరిక. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రజల ప్రాధాన్యతలు మారిపోయాయని ఈ ఫలితం చెప్పింది. రాష్ట్రం కావాలనే కోరిక నెరవేరింది. ఇక రాష్ట్రాన్ని ఎవరు మెరుగ్గా పాలిస్తారు? ఎవరు ఉద్యోగాలు ఇస్తారు? ఎవరు సంక్షేమం అందిస్తారు? ఎవరు ప్రజలకు దగ్గరగా ఉంటారు? అనే అంశాలే ఎన్నికల కేంద్రంగా మారాయి. ఇక్కడే బీఆర్ఎస్ అసలు బలహీనత బయటపడింది. ఉద్యమ పార్టీగా తనను తాను నిలబెట్టుకున్న పార్టీ.. పాలక పార్టీగా మారిన తర్వాత కొత్త రాజకీయ కథను నిర్మించలేకపోయింది. తెలంగాణ సాధన కథను పదేపదే చెప్పడం మాత్రమే సరిపోలేదు. తెలంగాణ వచ్చిన తర్వాతి తరం ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ఆ మార్పును పార్టీ పూర్తిగా అందుకోలేకపోయింది. బీఆర్ఎస్ బలం కేవలం కేసీఆర్ వ్యక్తిత్వం కాదు. కేసీఆర్ చుట్టూ ఏర్పడిన తెలంగాణ భావోద్వేగమే అసలు బలం. టీఆర్ఎస్ అనే పేరే ఆ భావోద్వేగానికి రాజకీయ చిరునామా. అందుకే పేరు మార్పు తర్వాత పార్టీకి ఎదురైన ప్రధాన సమస్య కేవలం ఎన్నికల పరాజయం కాదు.. గుర్తింపు సంక్షోభం.




## ఇంకా చాలా ఉంది!

### తెలంగాణే బీఆర్ఎస్ అసలు బలం

తెలంగాణ రాష్ట్రం కోసం పుట్టిన టీఆర్ఎస్.. ఉద్యమంతో ప్రజల గుండెల్లో బలమైన స్థానం సంపాదించింది. కేసీఆర్ నాయకత్వం, తెలంగాణ నినాదం పార్టీకి తిరుగులేని రాజకీయ బలంగా మారాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అదే సెంటిమెంట్ 2014, 2018 ఎన్నికల్లో అధికారాన్ని అందించింది. అందుకే బీఆర్ఎస్‌కు తెలంగాణ వాదం కేవలం సిద్ధాంతం కాదు.. పార్టీ రాజకీయ పునాదికి అసలు మూలం.

### టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్.. కీలక మలుపు

టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలన్న కేసీఆర్ నిర్ణయం పార్టీ ప్రయాణంలో పెద్ద మలుపు. తెలంగాణతో విడదీయరాని అనుబంధం ఉన్న పాత పేరును వదిలేయడం ద్వారా పార్టీ తన మూల గుర్తింపుపైనే ప్రయోగం చేసింది. దేశవ్యాప్త విస్తరణ ఆశించిన స్థాయిలో ఫలించకపోవడంతో తెలంగాణలో పార్టీ అసలు బలంపై కూడా ప్రశ్నలు తలెత్తాయి.

### పదేళ్ల పాలన తర్వాత ప్రజల తీర్పు

పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్ సంక్షేమం, సాగునీరు, రైతు కార్యక్రమాలతో తన ముద్ర వేసుకుంది. కానీ కాలం మారడంతో ప్రజల అంచనాలు కూడా మారాయి. ఉద్యోగాలు, ఉపాధి, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన వంటి అంశాలు ముందుకొచ్చాయి. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు, ఎమ్మెల్యేలపై అసంతృప్తి వంటి అంశాలను కాంగ్రెస్ బలంగా ప్రచారం చేసి 2023లో అధికారాన్ని చేజిక్కించుకుంది.

### కేసీఆర్ బలమే.. సవాలూ

కేసీఆర్ పేరు ఇప్పటికీ బీఆర్ఎస్‌కు అతిపెద్ద రాజకీయ ఆస్తి. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా ఆయనకు ఉన్న గుర్తింపు, ప్రజల్లో ఉన్న ప్రత్యేక స్పందన పార్టీకి బలంగా ఉన్నాయి. అదే సమయంలో పార్టీ మొత్తం ఒకే నాయకత్వం చుట్టూ తిరగడం భవిష్యత్తులో బలహీనతగా మారే అవకాశం ఉంది. కేటీఆర్, హరీశ్‌రావు వంటి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడం కీలకం.

### పునరాగమనానికి తెలంగాణే దారి

బీఆర్ఎస్ కథ ముగిసిపోయిందని చెప్పడం తొందరపాటే. గ్రామస్థాయిలో క్యాడర్, సంస్థాగత నిర్మాణం, కేసీఆర్‌పై నమ్మకం ఇప్పటికీ ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగితే అది బీఆర్ఎస్‌కు అవకాశం కావచ్చు. అయితే ప్రత్యర్థుల వైఫల్యాలపై ఆధారపడకుండా కొత్త రాజకీయ ఎజెండాతో ప్రజల్లోకి వెళ్లాలి. దేశ రాజకీయాల కంటే ముందు తెలంగాణ మనసును మళ్లీ గెలవడమే అసలు పరీక్ష.

# ఫ్యాక్షన్ టు ఎఫెక్షన్

## విభిన్న రాజకీయాల గడప కడప

- కోటి రెడ్డి మొదలు.. జగన్ రెడ్డి దాకా
- కడప కథలో ట్విస్టులు ఎన్నో.. ఎన్నెన్నో!
- ఒకప్పుడు పగలు ప్రతీకారాలు.. ఇప్పుడు ఓట్ల కథలు
- ఏడు రోడ్ల కూడలిలో ఎక్కిళ్లు పుట్టిస్తున్న రాజకీయం




**కడప రాజకీయ చరిత్రలో ఫ్యాక్షన్ అనే అధ్యాయాన్ని పూర్తిగా విస్మరించలేం. చిన్న గొడవలు పెద్ద ప్రతీకారాలకు దారితీయడం.. ఒక హత్యకు ప్రతీకారంగా మరిన్ని హత్యలు జరగడం.. గ్రామాల మధ్య, కుటుంబాల మధ్య వైరం తరతరాలకు కొనసాగడం వంటి ఘటనలు రాయలసీమ రాజకీయ చరిత్రలో నమోదయ్యాయి. అయితే కాలం మారింది. పరిపాలనా వ్యవస్థ బలపడింది. పోలీసింగ్ మారింది. ప్రజాస్వామ్య సంస్థలు బలపడ్డాయి. రాజకీయ పోరాటం కూడా రూపం మార్చుకుంది. ఒకప్పుడు గ్రామంలో ఎవరి మాట నడుస్తుందనేది ఆధిపత్యానికి కొలమానం. ఇప్పుడు ఎవరి పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి? ఎవరి బూత్ కమిటీ బలంగా ఉంది? ఎవరి వెంట గ్రామ నాయకులు ఉన్నారు? ఎవరు ప్రత్యర్థి వర్గాన్ని చీల్చగలరు? అనే ప్రశ్నలు ముందుకు వచ్చాయి. అంటే ఫ్యాక్షన్ పూర్తిగా కనుమరుగైందా అంటే సమాధానం అంత సులభం కాదు. కానీ దాని రాజకీయ రూపం మాత్రం మారింది. పాత వర్గాలు ఇప్పుడు రాజకీయ వర్గాలుగా మారాయి. పాత ఆధిపత్య పోరు ఇప్పుడు ఎన్నికల ఆధిపత్య పోరుగా మారింది.**

### వైఎస్ కుటుంబం.. పులివెందుల నుంచి రాష్ట్ర రాజకీయాల వరకు

కడప రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే రాయలసీమ సామాజిక చరిత్రను అర్థం చేసుకోవాలి. పాలెగాళ్ల కాలంలో భూమి, నీరు, పన్నులు, స్థానిక అధికారం, అనుచర బలం ఆధిపత్యానికి ప్రధాన సాధనాలు. ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత ఆ వ్యవస్థలు మారిపోయాయి. కానీ ఆధిపత్య భావన మాత్రం ఒక్కరోజులో మాయమవలేదు. భూమి, ఆయుధం స్థానంలో ఓటు బ్యాంకు, ఆర్థిక వనరులు, పార్టీ సంస్థ, వ్యక్తిగత సంబంధాలు, రాజకీయ పరిచయాలు వచ్చాయి. అందుకే కడపలో కుటుంబం అంటే కేవలం ఇంటిపేరు కాదు. దాని వెనుక గ్రామాల వారీగా ఉన్న సంబంధాలు, అనుచరులు, సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల నెట్‌వర్క్, పార్టీ కేడర్ ఉంటాయి. ఈ బలాలన్నీ కలిసి ఒక కుటుంబాన్ని రాజకీయంగా నిలబెడతాయి. అదే సమయంలో ఈ వ్యవస్థలో చీలిక వస్తే.. దాని ప్రభావం కూడా అంతే వేగంగా కనిపిస్తుంది. కడప రాజకీయ చరిత్రలో వైఎస్ కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకు ఈ కుటుంబం కడప రాజకీయాలపై మాత్రమే కాదు.. రాష్ట్ర రాజకీయాలపైనా గణనీయమైన ముద్ర వేసింది. ముఖ్యంగా పులివెందుల వైఎస్ కుటుంబానికి రాజకీయ కోటగా మారింది. 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి 61,176 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడం ఆ కుటుంబానికి అక్కడ ఉన్న వ్యక్తిగత రాజకీయ బలాన్ని మరోసారి చాటింది. జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు ఎంతగా మారినా.. పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఉన్న వ్యక్తిగత సంబంధాలు, వారసత్వ ప్రభావం, స్థానిక సంస్థాగత బలం ఇప్పటికీ అసాధారణంగానే ఉన్నాయి. అందుకే పులివెందులలో ఇతర పార్టీల గెలుపు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఒక బ్రహ్మపదార్థంగానే కనిపిస్తుంది.

### బద్వేలు.. వీరారెడ్డి కుటుంబానికి చెల్లుచీటి?

బద్వేలు రాజకీయాల్లో ఇప్పుడు కొత్త సమీకరణాలు కనిపిస్తున్నాయి. బిజివేముల వీరారెడ్డి కుటుంబం చాలా కాలంగా అక్కడ రాజకీయ ప్రభావాన్ని చూపింది. అయితే ఆ కుటుంబ ఆధిపత్యానికి ఇప్పుడు చెల్లుచీటి పలికినట్టుగా రాజకీయ పరిణామాలు కనిపిస్తున్నాయి. కొత్తగా టీడీపీ పగ్గాలు చేపట్టిన మంచూరు సూర్యనారాయణరెడ్డికి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఒకరకంగా ముళ్లకిరీటమే. ముందున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఆయన రాజకీయ సామర్థ్యానికి అగ్నిపరీక్ష కానున్నాయి. వీరారెడ్డి కుటుంబం పూర్తిస్థాయిలో ఆయనకు మద్దతుగా నిలుస్తుందా? లేక తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వేరే వ్యూహం అనుసరిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు గత ఐదు ఎన్నికల నుంచి వరుస విజయాలతో తనదైన రాజకీయ ముద్ర వేసిన వైసీపీ నేత డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తదితరులు టీడీపీ అంతర్గత పరిణామాలను గమనిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. టీడీపీ ఇంటి పంచాయితీ తమకు ఎంతవరకు లాభిస్తుందో చూసే వ్యూహంలో వైసీపీ ఉన్నట్టుగా కనిపిస్తోంది.

### కడపలో మాధవి దంపతులు... ప్రొద్దుటూరులో మూడు ముక్కలాట!

కడప అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీకి చెందిన రెడ్డెప్పగారి మాధవి విజయం 2024లో కీలక రాజకీయ మార్పు. అయితే గెలుపు తర్వాత కూడా పార్టీలో అంతర్గత సమీకరణాలు పూర్తిగా సద్దుమణిగినట్టు కనిపించడం లేదు. వైసీపీ వర్గాలను దగ్గరకు తీసుకోవడం ద్వారా సొంత పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ఒక వర్గానికి మాధవి దంపతులు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ వర్గంలోని కొందరు పక్క నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డిని ఆశ్రయించడం కూడా పార్టీలో కొత్త సమీకరణాలకు కారణమవుతున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ. కడపలో రెండు బలమైన సామాజిక వర్గాలు రెడ్డెప్పగారి కుటుంబానికి ప్రతికూలంగా ఉన్నాయనే ప్రచారం కూడా ఉంది. అయితే రాజకీయాల్లో సామాజిక ఎఫెక్ట్‌తో సొంత పార్టీ కేడర్, ద్వితీయ శ్రేణి నాయకత్వం, స్థానిక సంస్థలు, ప్రత్యర్థి వర్గాల కదలికలు అన్నీ కలిసే భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రొద్దుటూరు రాజకీయాలు ఇప్పుడు మరో రకమైన ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 2024లో టీడీపీకి చెందిన నంద్యాల వరదరాజులరెడ్డి 10,200 ఓట్ల మెజారిటీతో గెలిచారు. కానీ ప్రస్తుతం టీడీపీలో మూడు ముక్కల రాజకీయ గేమ్ నడుస్తోందనే చర్చ ఉంది. నాయకత్వం, కేడర్, వ్యక్తిగత ఆధిపత్యం విషయంలో అంతర్గత విభేదాలు బలపడితే ప్రత్యర్థి వైసీపీకి పుంజుకునే అవకాశం ఉంటుంది. ప్రొద్దుటూరు పూర్తిగా పట్టణ రాజకీయాల ప్రభావంలో ఉండే నియోజకవర్గం. వ్యాపార వర్గాలు, యువత, ఉద్యోగాలు, స్థానిక అభివృద్ధి, అభ్యర్థి వ్యక్తిగత సంబంధాలు ఇక్కడ కీలకం. అందుకే టీడీపీ అంతర్గత విభేదాలు కొనసాగితే.. 2024లో వచ్చిన మెజారిటీని నిలబెట్టుకోవడం అంత సులభం కాకపోవచ్చు.

### మైదుకూరులో పుట్టా బీసీ బలం.. బలహీనతవుతోందా?

ఇక మైదుకూరు రాజకీయాలు సరేసరి. ఇక్కడ తొలిసారిగా బీసీ సామాజికవర్గానికి చెందిన పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ నుంచి గెలుపొందడం రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. 2024లో ఆయన 8,178 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పుట్టా కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయం ఒకవైపు.. బీసీ సామాజికవర్గం నుంచి వచ్చిన నాయకుడిగా ఆయనకు లభించిన మద్దతు మరోవైపు.. మైదుకూరులో ఆయనకు బలమైన రాజకీయ పునాది ఏర్పరిచాయి. అయితే ప్రస్తుతం ఆయన చుట్టూ అదే సామాజికవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వర్గాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనే అభిప్రాయం ఇతర సామాజికవర్గాల్లో వినిపిస్తోంది. కాంట్రాక్టు పనులు, ఇతర వ్యాపార అవకాశాలు, రాజకీయ ప్రాధాన్యతలు ఒకే వర్గం చుట్టూ తిరుగుతున్నాయనే భావన కొన్ని వర్గాల్లో బలపడుతోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇవి రాజకీయ ఆరోపణలు, స్థానికంగా వినిపిస్తున్న అభిప్రాయాలుగానే చూడాలి. కానీ రాజకీయాల్లో భావన కూడా ఒక బలమైన అంశమే. ఒక సామాజికవర్గం మొత్తం నాయకుడి వెనుక నిలబడటం బలంగా మారుతుంది. అదే సమయంలో ఇతర వర్గాల్లో 'మనకు ప్రాధాన్యం లేదు' అనే భావన ఏర్పడితే.. అది అసంతృప్తికి దారి తీస్తుంది. ఆ అసంతృప్తికి ప్రత్యర్థి రాజకీయ శక్తి దిశ చూపితే.. తిరుగుబాటు రూపం దాల్చే అవకాశం ఉంటుంది. మైదుకూరులో అలాంటి పరిణామం వస్తే దాన్ని ఆపడం ఎవరి తరం కాకపోవచ్చనే చర్చ కూడా ఉంది. అందుకే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు ప్రస్తుతం ఉన్న బీసీ మద్దతే ప్రధాన బలం. అదే సమయంలో అన్ని సామాజికవర్గాలను కలుపుకుని వెళ్లడం ఆయన రాజకీయ భవిష్యత్తుకు మరింత కీలకం.

### కమలాపురం అలా.. జమ్మలమడుగులో ఇలా..!

కమలాపురంలో యువకుడు పుత్తా చైతన్యరెడ్డి టీడీపీ నుంచి గెలుపొందారు. ప్రస్తుతం పార్టీలో ఆయనకు పెద్దగా ప్రత్యక్ష పోటీ కనిపించకపోయినా.. వచ్చే ఎన్నికలకు వైఎస్ కుటుంబం నుంచి కొత్త అభ్యర్థి బరిలోకి దిగే అవకాశం ఉందనే చర్చ ఉంది. అదే జరిగితే కమలాపురం రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారే అవకాశం ఉంది. చైతన్యరెడ్డికి యువ నాయకుడిగా ఉన్న ఇమేజ్, టీడీపీ కేడర్ ఒకవైపు ఉంటే.. వైఎస్ కుటుంబానికి ఉన్న వారసత్వ రాజకీయ ప్రభావం మరోవైపు ఉంటుంది. అందువల్ల ఇప్పుడున్న సమీకరణాలను మరో మూడేళ్లు యథాతథంగా కొనసాగుతాయని భావించడం తొందరపాటు. జమ్మలమడుగు రాజకీయాలు మరో ఆసక్తికరమైన అధ్యాయం. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా సి. ఆదినారాయణరెడ్డి ఉంటే.. అన్న కుమారుడైన అబ్బాయి భూపేష్‌రెడ్డి టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అంటే కూటమిలోని రెండు కీలక పార్టీల రాజకీయ వ్యవస్థ ఒకే కుటుంబానికి అనుసంధానమై ఉండటం ప్రత్యేకత. అయితే 2024లో ఆదినారాయణరెడ్డి కేవలం 1,908 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అందువల్ల ఈ నియోజకవర్గంలో రాజకీయ ఆధిపత్యం ఎంత సున్నితంగా ఉందో అర్థమవుతుంది. వచ్చే మూడేళ్ల పాలనలో అభివృద్ధి, వ్యక్తిగత పనితీరు, కుటుంబ ప్రభావం, కూటమి సమన్వయం అన్నీ కలిసి ఫలితాన్ని నిర్ణయించవచ్చు. ఇక్కడ రాజకీయ మిరాకిల్ ఎప్పుడు జరుగుతుందో చెప్పడం కష్టం.

### రాజంపేట వయా రాయచోటిలో ట్విస్టులు

రాజంపేట పరిస్థితి పూర్తిగా భిన్నం. 2024లో వైసీపీకి చెందిన ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి 8,378 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. టీడీపీకి ఇక్కడ బలమైన కేడర్ ఉందనే అభిప్రాయం ఉన్నప్పటికీ.. ఆ కేడర్‌ను ఎన్నికల విజయంగా మలిచే సారథ్యం బలహీనంగా ఉందనే చర్చ ఉంది. టీడీపీ వ్యూహం మారకపోతే.. బలమైన కేడర్ ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో అది ప్రయోజనంగా మారకపోవచ్చనే అభిప్రాయం ఉంది. ఒకవైపు వైసీపీకి స్థానిక రాజకీయ సంబంధాలు, మరోవైపు టీడీపీకి సంస్థాగత బలం.. ఈ రెండింటి మధ్య సరైన నాయకత్వం ఎవరి వైపు ఉంటుందో అదే రాజంపేట భవిష్యత్తును నిర్ణయిస్తుంది. రాయచోటిలో తొలిసారి ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా మంత్రి పదవిని కూడా దక్కించుకున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాజకీయంగా లక్కీస్టార్‌గా నిలిచారు. 2024లో ఆయన కేవలం 2,495 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అంటే విజయం సాధించినా నియోజకవర్గం పూర్తిగా టీడీపీ వైపు మళ్లిపోయిందని చెప్పలేం. ఇదే సమయంలో రాయచోటి జిల్లా కేంద్రం విషయంలో జరిగిన పరిణామాలపై వైసీపీ తీవ్ర విమర్శలు చేసింది. మంత్రి పదవి కోసం జిల్లా కేంద్రాన్ని తాకట్టు పెట్టారనే ఆరోపణలను వైసీపీ చేసింది. ఇవి రాజకీయ ఆరోపణలే అయినప్పటికీ.. రాయచోటి రాజకీయ చర్చలో ఈ అంశం ప్రభావం చూపుతోంది. మరోవైపు అన్నమయ్య జిల్లాలోని కొందరు సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచి కూడా మండిపల్లికి రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్నాయనే ప్రచారం ఉంది. వైసీపీకి బలమైన పునాది ఉన్న నియోజకవర్గం కావడంతో రాబోయే రోజుల్లో ఇక్కడ పోరు మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది.

### రైల్వేకోడూరులో కూటమి రాజకీయం.. రచ్చే రచ్చ!

రైల్వేకోడూరులో జనసేన ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ విజయం కూటమికి కీలక విజయంగా నిలిచింది. అయితే ప్రస్తుతం అక్కడ కూటమి రాజకీయాలు అంతర్గత వివాదాలతో వార్తల్లోకి వస్తున్నాయి. ఎమ్మెల్యేపై ప్రభుత్వ ఉద్యోగినికి సంబంధించిన లైంగిక వేధింపుల ఆరోపణలపై వివాదం చెలరేగింది. మరోవైపు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఈ ఆరోపణల నిజానిజాలు సంబంధిత దర్యాప్తులు, చట్టపరమైన ప్రక్రియల ద్వారా తేలాల్సి ఉంటుంది. కానీ రాజకీయంగా మాత్రం ఒక విషయం స్పష్టం. కూటమి పార్టీల మధ్య సమన్వయం బలహీనపడితే.. 2024లో జరిగిన ఓట్ల బదిలీ భవిష్యత్తులో అంత సులభంగా పునరావృతం కాకపోవచ్చు.

### పార్టీ ఏదైనా.. పవర్ మాత్రం రెడ్డి గారిదేనా?

2024 ఫలితాలను మొత్తంగా చూస్తే ఉమ్మడి కడప జిల్లాలో టీడీపీ 5, వైసీపీ 3, బీజేపీ 1, జనసేన 1 స్థానాలను గెలుచుకున్నాయి. అంటే కూటమి ఏడు స్థానాలను దక్కించుకుంది. ఇది కడప రాజకీయ చరిత్రలో చిన్న విషయం కాదు. వైఎస్ కుటుంబ ప్రభావం బలంగా ఉన్న జిల్లాలో కూటమి ఏడు స్థానాలు గెలవడం రాజకీయంగా పెద్ద మార్పు. అయితే అదే సమయంలో వైసీపీ పులివెందుల, బద్వేలు, రాజంపేట స్థానాలను నిలబెట్టుకుంది. ముఖ్యంగా పులివెందులలో జగన్‌కు వచ్చిన 61,176 ఓట్ల మెజారిటీ ఆ కుటుంబానికి ఉన్న అసాధారణ బలాన్ని స్పష్టం చేసింది. కాబట్టి 2024ను వైసీపీ అంతమైందని చదవడం ఎంత తప్పో.. కడపలో టీడీపీ శాశ్వత ఆధిపత్యం మొదలైందని చెప్పడం కూడా అంతే తప్పు. కడప రాజకీయాల్లో రెడ్డి సామాజికవర్గం ప్రాధాన్యాన్ని విస్మరించడం సాధ్యం కాదు. వైఎస్ కుటుంబం, గడికోట కుటుంబం, మండిపల్లి కుటుంబం, దేవగుడి కుటుంబం వంటి అనేక రాజకీయ కుటుంబాల ప్రభావం ఈ ప్రాంత రాజకీయాల్లో కనిపించింది. అయితే 'కడప మొత్తం ఒకే సామాజికవర్గం చేతుల్లో ఉంది' అని చెప్పడం వాస్తవ పరిస్థితులను అతిసరళీకరించడం అవుతుంది. ముస్లిం, ఎస్సీ, బీసీ, ఇతర సామాజికవర్గాల ఓటు లేకుండా ఏ నియోజకవర్గంలోనూ గెలుపు సాధ్యం కాదు. మైదుకూరులో బీసీ నాయకత్వం, కడపలో మైనారిటీ ఓటు ప్రాధాన్యం, బద్వేలులో రిజర్వ్ నియోజకవర్గ సమీకరణాలు.. ఇవన్నీ కడప రాజకీయాలు ఒకే సామాజిక సమీకరణంతో నడవవని చెబుతున్నాయి. అందుకే 'పార్టీ ఏదైనా.. పవర్ మాత్రం రెడ్డి గారిదే' అనే రాజకీయ వాస్తవానికి మరో కోణం ఉంది. నాయకత్వంలో ఒక సామాజికవర్గం అధికంగా కనిపించినా.. ఆ నాయకత్వానికి అధికారాన్ని ఇచ్చేది మాత్రం అనేక సామాజికవర్గాల ఓటే.

### చివరికి.. కడప కోటలకు తాళాలు ఎవరి దగ్గర?

కడప రాజకీయాలు ఇక కత్తుల కథ కాదు. కేవలం కుటుంబాల కథ కూడా కాదు. ఇది కుటుంబ ప్రభావం, పార్టీ కేడర్, సామాజిక సమీకరణాలు, సంక్షేమం, అభివృద్ధి, యువత ఆకాంక్షలు, వ్యక్తిగత నాయకత్వం, అంతర్గత విభేదాల కలయిక. వైఎస్ కుటుంబం వేసిన ముద్రను కడప రాజకీయాల నుంచి ఎవరూ చెరపలేరు. అదే సమయంలో 2024లో కూటమి సాధించిన ఏడు స్థానాల విజయాన్ని కూడా చిన్నచూపు చూడలేం. పులివెందులలో జగన్‌కు తిరుగులేని పట్టు ఉన్నా.. మిగిలిన నియోజకవర్గాల్లో రాజకీయ పోరు తెరుచుకుంది. కుటుంబాల కోటలు ఉన్నా.. వాటి గోడల మధ్య చీలికలు మొదలైతే ప్రత్యర్థికి తలుపులు తెరుచుకుంటాయి. ఒకప్పుడు కడప రాజకీయాలను 'ఎవరి వర్గం బలంగా ఉంది?' అని కొలిచేవారు. ఇప్పుడు 'ఎవరి ఓటు బలంగా ఉంది?' అని కొలవాల్సిన పరిస్థితి. ఒకప్పుడు ప్రత్యర్థి కుటుంబాన్ని ఓడించడం లక్ష్యంగా ఉండేది. ఇప్పుడు ప్రత్యర్థి బూత్‌ను మించి ఓట్లు తెచ్చుకోవడం లక్ష్యం. అందుకే కడప రాజకీయాల అసలు సూత్రం ఒక్కటే.. ఇక్కడ కోటలు ఉంటాయి.. కానీ ఆ కోటలకు తాళాలు శాశ్వతంగా ఎవరి దగ్గరా ఉండవు. స్వాతంత్ర్య యోధుడు కోటిరెడ్డి నుంచి శక్తిమంతమైన జగన్‌రెడ్డి దాకా సాగిన ఈ రాజకీయ ప్రయాణంలో ఎన్నో కుటుంబాలు వచ్చాయి.. కొన్ని ఎదిగాయి.. కొన్ని కనుమరుగయ్యాయి. పార్టీలు మారాయి.. జెండాలు మారాయి.. నాయకులు మారారు. కానీ కడప ఓటరు మాత్రం ప్రతి ఎన్నికలో తనదైన తీర్పుతో కొత్త అధ్యాయం రాస్తూనే ఉన్నాడు. అందుకే కడప రాజకీయాలను 'రెడ్డి వర్సెస్ రెడ్డి'గా మాత్రమే చదవడం తక్కువ అంచనా. ఇది కుటుంబం వర్సెస్ కుటుంబం.. పార్టీ వర్సెస్ పార్టీ.. పాత ఆధిపత్యం వర్సెస్ కొత్త ఆకాంక్షలు.. వారసత్వం వర్సెస్ పనితీరు.. కేడర్ వర్సెస్ నాయకత్వం మధ్య సాగుతున్న సుదీర్ఘ రాజకీయ పోరాటం. ఫ్యాక్షన్ నీడలు చరిత్రలో మిగిలిపోవచ్చు. కుటుంబాల ప్రభావం కొనసాగవచ్చు. సామాజిక సమీకరణాలు మారవచ్చు. పార్టీలు మారవచ్చు. అభ్యర్థులు మారవచ్చు. కానీ చివరికి కడప రాజకీయాల భవిష్యత్తును నిర్ణయించేది ఒక్కటే —— ఓటరు. కడప ఇంకా కుటుంబాల నేలే.. కానీ ఆ కుటుంబాల భవిష్యత్తుకు తాళం చెవి ఇప్పుడు కత్తి కాదు.. ఓటు మాత్రమే! **

### 2029 నాటికి కడపలో ఏం జరగబోతోంది?

**కడప రాజకీయాలను కుటుంబాల నుంచి అభివృద్ధి అంశాల వైపు తీసుకెళ్తున్న మరో ప్రధాన శక్తి యువత. నీరు, సాగు, రహదారులు, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగాలు వంటి అంశాలు ఇప్పుడు రాజకీయ చర్చలో ముందుకు వస్తున్నాయి. ఒకప్పుడు 'మన వర్గం ఎవరు?' అన్నది ముఖ్యమైతే.. ఇప్పుడు 'మన ప్రాంతానికి ఎవరు పరిశ్రమ తీసుకొస్తారు? మన పిల్లలకు ఉద్యోగాలు ఎవరు కల్పిస్తారు?' అనే ప్రశ్నలు పెరుగుతున్నాయి. సోషల్ మీడియా, పట్టణీకరణ, విద్య, వలసలు యువత ఆలోచనలను మార్చుతున్నాయి. కుటుంబం చెప్పిన పార్టీకి ఓటు వేయడం అనే పాత సంప్రదాయం పూర్తిగా అంతరించకపోయినా.. కొత్త తరం నాయకుడిని ప్రశ్నిస్తోంది. ప్రభుత్వ పనితీరును అంచనా వేస్తోంది. ఎమ్మెల్యే అందుబాటులో ఉన్నాడా? నియోజకవర్గానికి ఏం చేశాడు? అనే ప్రశ్నలు అడుగుతోంది. 2024లో ఏర్పడిన రాజకీయ సమీకరణాలు 2029 వరకు యథాతథంగా ఉంటాయని చెప్పడం కష్టం. కూటమి ప్రభుత్వ పనితీరు, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగం, ధరలు, పార్టీ అంతర్గత విభేదాలు, అభ్యర్థుల మార్పులు, కూటమి సమన్వయం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకం కానున్నాయి. 1,908 ఓట్ల జమ్మలమడుగు, 2,495 ఓట్ల రాయచోటి వంటి నియోజకవర్గాలు స్వల్ప మార్పుతోనే ఫలితం తారుమారు కావచ్చని చెబుతున్నాయి. మైదుకూరులో సామాజిక అసంతృప్తి రాజకీయ రూపం దాల్చుతుందా? ప్రొద్దుటూరులో టీడీపీ మూడు ముక్కల గేమ్ కొనసాగుతుందా? కడపలో అంతర్గత అసమ్మతి ఏ స్థాయికి వెళ్తుంది? కమలాపురంలో వైఎస్ కుటుంబం కొత్త అభ్యర్థిని తెస్తుందా? రాజంపేటలో టీడీపీ సారథ్యం మారుతుందా? జమ్మలమడుగులో బాబాయ్–అబ్బాయ్ సమీకరణం ఎంతకాలం పనిచేస్తుంది? రాయచోటిలో మండిపల్లి తన రాజకీయ పునాదిని ఎంత బలపరుచుకుంటారు? రైల్వేకోడూరులో కూటమి అంతర్గత వివాదాలు ఎటు దారి తీస్తాయి? ఇవన్నీ 2029 సమీకరణాల్లో కీలక ప్రశ్నలుగా మారనున్నాయి.**



### భారత్ వ్యూహంపై
# హర్ష భోగ్లే ఫైర్
### బ్యాటింగ్ తీరుపై తీవ్ర విమర్శలు

శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ తీరుపై ప్రముఖ కామెంటేటర్ హర్ష భోగ్లే తీవ్ర విమర్శలు చేశారు. కీలక సమయంలో వేగంగా పరుగులు చేయకుండా ఎక్కువ సమయం తీసుకోవడాన్ని భోగ్లే తప్పుపట్టారు. ముఖ్యంగా మ్యాచ్‌పై వర్షం ప్రభావం ఉండే అవకాశం ఉన్న సమయంలో మరింత వేగంగా ఆడాల్సిందని అభిప్రాయపడ్డారు. భోగ్లే తన సోషల్ మీడియా పోస్టులో భారత్ చివరి 40 నిమిషాల బ్యాటింగ్‌పై సందేహం వ్యక్తం చేశారు. "భారత్ వ్యూహం ఏంటో అర్థం కాలేదు..సమయాన్ని కోల్పోయింది..పరుగులు మాత్రం పెద్దగా చేయలేదు" అంటూ విమర్శించారు. వర్షం వచ్చే అవకాశం ఉన్నప్పుడు శ్రీలంకను ఆలౌట్ చేసేందుకు భారత బౌలర్లకు వీలైనంత ఎక్కువ సమయం ఇవ్వాల్సిందని సూచించారు.

# శ్రీలంకపై భారత్ ఘన విజయం
## సుతార్ స్పిన్‌కు లంక విలవిల

గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండో టెస్టు ఆడుతున్న యువ ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుత ప్రదర్శనతో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టిన సుతార్.. మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు తీసుకున్నాడు. దీంతో శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే ఆలౌటైంది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ మ్యాచ్ ద్వారా భారత్‌కు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో 12 కీలక పాయింట్లు లభించాయి. గాలేలో జరిగిన ఈ మ్యాచ్ ఆ మైదానంలో 50వ టెస్టు కావడం విశేషం. భారత్ ఆడిన టెస్టుల్లో ఇది 600వ టెస్ట్ కావడం మరో ప్రత్యేకత.

### కీలక దశలో సుతార్ మ్యాజిక్

ఐదో రోజు లంచ్ తర్వాత శ్రీలంక బ్యాటర్లు సోనల్ దినుష, కేశర నువంతా ప్రతిఘటించారు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన దినుష రెండో ఇన్నింగ్స్‌లోనూ 84 పరుగులతో భారత్‌కు ఇబ్బందులు సృష్టించాడు. ఈ సమయంలో సుతార్ ఒక్కసారిగా మ్యాచ్‌ను మార్చేశాడు. 76వ ఓవర్‌లో మూడు వికెట్ల మెయిడిన్ వేసి శ్రీలంక పతనానికి బాటలు వేశాడు. ముందుగా దినుషను క్యాచ్‌కు పంపిన సుతార్.. తర్వాతి బంతికే ప్రభాత్ జయసూర్యను క్లీన్ బౌల్డ్ చేశాడు. హ్యాట్రిక్ బంతిని తప్పించుకున్న లహిరు కుమారను కొద్దిసేపటికే క్యాచ్‌కు పంపాడు. దీంతో వరుసగా రెండో టెస్టులోనూ సుతార్ ఐదు వికెట్ల ఘనత సాధించాడు. చివరికి నువంతాను బౌల్డ్ చేసి శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

### బ్యాటింగ్‌లోనూ భారత్ ఆధిపత్యం

భారత్ విజయానికి బ్యాటింగ్‌లోనూ కీలక సహకారం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో దేవదత్ పడిక్కల్ అద్భుతంగా 167 పరుగులు చేయడంతో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది.



దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. రెండో ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ బాధ్యతాయుతంగా 66 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. అనంతరం మలుపులు తిరుగుతున్న గాలే పిచ్‌పై భారత బౌలర్లు శ్రీలంక బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ముఖ్యంగా మానవ్ సుతార్ తన స్పిన్‌తో శ్రీలంకను పూర్తిగా దెబ్బతీశాడు. 10 వికెట్ల మ్యాచ్ హాల్‌తో సుతార్ భారత విజయానికి హీరోగా నిలిచాడు. ఈ గెలుపుతో సిరీస్‌లో భారత్ ఆధిక్యం సాధించడంతో రెండో టెస్టుపై ఆసక్తి మరింత పెరిగింది.

# WTC లో భారత్‌కు పెరిగిన ఆశలు
## గాలే విజయంతో పెరిగిన పర్సంటేజ్

శ్రీలంకపై గాలే టెస్టులో 165 పరుగుల భారీ విజయం సాధించిన భారత్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో తన స్థితిని మెరుగుపరుచుకుంది. భారత్ ఐదో స్థానంలోనే కొనసాగుతున్నా..పాయింట్స్ పర్సంటేజ్ 48.15 నుంచి 53.33కి పెరిగింది. 372 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకను 206 పరుగులకే ఆలౌట్ చేయడంలో యువ స్పిన్నర్ మానవ్ సుతార్ కీలక పాత్ర పోషించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన సుతార్ మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు శ్రీలంక పర్సంటేజ్ 33.33కి పడిపోయింది. అయితే బంగ్లాదేశ్ ఇప్పటికే ఆస్ట్రేలియాపై విజయం సాధించి నాలుగో స్థానంలో ఉండటంతో.. భారత్ భారీ గెలుపు సాధించినా ర్యాంక్‌లో ముందుకు వెళ్లలేకపోయింది. గాలే విజయం మాత్రం భారత్ ఫైనల్ అవకాశాలకు గట్టి ఊపునిచ్చింది.

### ఇక ప్రతి టెస్టూ కీలకమే

శ్రీలంకతో రెండో టెస్టు ఆగస్టు 23న కొలంబోలో ప్రారంభం కానుంది. ఆ తర్వాత భారత్ న్యూజిలాండ్‌తో రెండు టెస్టులు ఆడనుంది. WTC సైకిల్ ముగింపులో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ కూడా భారత్ ఆడాల్సి ఉంది. ఇప్పటివరకు 10 టెస్టుల్లో నాలుగు ఓడిన భారత్‌కు మిగిలిన మ్యాచ్‌లు అత్యంత కీలకంగా మారాయి. మిగిలిన ఎనిమిది టెస్టుల్లో ఏడు గెలిస్తే పర్సంటేజ్ 68.52కి చేరే అవకాశం ఉంది. ఆరు విజయాలు, రెండు ఓటములు వస్తే 62.96కి పడిపోతుంది. అందుకే ఇకపై ప్రతి మ్యాచ్‌ను గెలవడం భారత్‌కు దాదాపు తప్పనిసరి. ఒక్క ఓటమి కూడా ఫైనల్ అవకాశాలను తీవ్రంగా దెబ్బతీసే పరిస్థితి ఉంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్‌కు ఇక ప్రతి టెస్టూ నాకౌట్ మ్యాచ్‌లా మారింది.

# శ్రీలంకకు ఎదురుదెబ్బ
### గాయాలతో లంకేయులు




భారత్‌తో గాలేలో జరిగిన తొలి టెస్టులో 165 పరుగుల తేడాతో ఓటమి ఎదురైన శ్రీలంకకు మరో షాక్ తగిలింది. రెండో టెస్టుకు కీలక ఆటగాళ్లు దూరమవుతున్నారు. శ్రీలంక కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ వెల్లడించిన వివరాల ప్రకారం కుశాల్ మెండిస్, దినేశ్ చాందిమాల్, పాథుమ్ నిస్సాంక తదుపరి టెస్టుకు అందుబాటులో ఉండరు. ముఖ్యంగా కుశాల్ మెండిస్‌కు తీవ్రమైన హ్యామ్‌స్ట్రింగ్ గాయం కావడంతో కొంతకాలం క్రికెట్‌కు దూరంగా ఉండాల్సి ఉంటుందని కిర్‌స్టెన్ తెలిపారు. దీంతో భారత్‌తో రెండో టెస్టుకు శ్రీలంక జట్టు కూర్పుపై ప్రభావం పడనుంది. మరోవైపు యువ ఆటగాళ్లకు అవకాశం లభించనుంది. దేశవాళీ క్రికెట్‌లో మంచి రికార్డు ఉన్న ఆటగాళ్లను జట్టులోకి తీసుకుని తమ సత్తా నిరూపించుకునే అవకాశం ఉందని కిర్‌స్టన్ చెప్పారు. తొలి టెస్టులో 99 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా శ్రీలంక చివరి రోజు వరకు పోరాడటం సానుకూల అంశమని ఆయన పేర్కొన్నారు. అయితే టాప్ ఆర్డర్ బ్యాటింగ్ వైఫల్యమే ఓటమికి ప్రధాన కారణమని కిర్‌స్టన్ అభిప్రాయపడ్డారు. యువ బ్యాటర్ సోనల్ దినూష తొలి ఇన్నింగ్స్‌లో శతకం, రెండో ఇన్నింగ్స్‌లో 84 పరుగులతో ఆకట్టుకోవడం జట్టుకు ఆశాజనకంగా మారింది.

# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్

అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.







# ఓటీటీలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్ఠాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.




### 24న మహాకాళి
# ఫస్ట్ గ్లింప్స్

పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టాక్సిక్ ..
## పెద్దల సినిమా మాత్రమే
**• పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్**

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.



### అనుకున్న సమయానికే
# స్పిరిట్ విడుదల
**వాయిదా వార్తలను ఖండించిన టీమ్**

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ ` వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పు లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు.




పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.